PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 299 | విజయవాడ, సోమవారం 3 జూన్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 3 June 2024 | Rs

మూడు జోన్లుగా తెలంగాణ

- ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో సిఎం రేవంత్

లోపలి పేజీలో..



'నైరుతి' వచ్చేసింది

- రాయలసీమ, కోస్తా జిల్లాల్లోకి 3 రోజుల ముందే
- 5వ తేదీ నాటికి రాష్ట్రం అంతటా విస్తరించే అవకాశం



సత్తెనపల్లిలో 500 మంది పోలీసులతో మార్చ్ ఫాస్ట్‌లో కలెక్టర్, ఎస్‌పి

పల్నాడులో భయం... భయం

- పోలీసుల డేగ కన్ను
- అల్లర్లు జరగకుండా భారీ బందోబస్తు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి, సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున రాష్ట్రంలోనే అత్యధికంగా ఘర్షణలు జరిగిన పల్నాడు జిల్లాలో పరిస్థితి ప్రస్తుతం నిరువుగప్పిన నిప్పులా ఉంది. గత అనుభవాల దృష్ట్యా కౌంటింగ్ అనంతరం ఘర్షణలు చోటుచేసుకొని అవకాశం ఉందని ప్రజలు భయాందోన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాపై పోలీసులు డేగ కన్ను వేశారు. అల్లర్లు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఓట్ల లెక్కింపు నరసరావుపేటలోని జెఎన్‌టియు కళాశాలలో మంగళవారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఫలితాల అనంతరం పరిస్థితులు ఎలా ఉంటాయోనని ప్రధాన పార్టీ నేతలు, కార్యకర్తలతోపాటు ప్రజల్లోనూ భయం నెలకొంది. గత ఐదేళ్లుగా వైసిపి వారు టిడిపి వారిని తీవ్రంగా వేధించారన్న విమర్శలు ఉన్నాయి. టిడిపి గెలిస్తే వైసిపి వారిపై పగ తీర్చుకొనే అవకాశం ఉందని, వైసిపి గెలిస్తే టిడిపి వారిపై మళ్లీ దాడులు జరిగే అవకాశం ఉందని సర్వత్రా భావిస్తున్నారు. పల్నాడు జిల్లాలో ఏ పార్టీ గెలిచినా ప్రత్యర్థి పార్టీలపై దాడులు జరుగుతాయని నిఘా వర్గాలూ హెచ్చరించడంతో దాదాపు నాలుగు వేల మంది పోలీసులు సమస్యాత్మక గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎన్నికల పోలింగ్‌కు వారం ముందు నుంచే అదనపు బలగాలు జిల్లాకు వచ్చాయి. అయినా, గత నెల 13న పోలింగ్ రోజున, అనంతరం రెండు రోజులపాటు ఘర్షణలు జరిగాయి. దీంతో, మరింతమంది అదనపు బలగాలు కావాలని ఎన్నికల కమిషన్‌కు అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో మరో 19 కంపెనీల అదనపు బలగాలు గత నెల మూడో వారంలో జిల్లాకు చేరాయి. పోలింగ్ రోజున ఘర్షణలకు సంబంధించి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై మూడు హత్యాయత్నం కేసులు, ఇవిఎం ధ్వంసం కేసులతోపాటు మొత్తం నాలుగు కేసులు నమోదయ్యాయి. వీటిపై ఆయన హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొంది ప్రస్తుతం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో బస చేసి రోజూ ఎస్‌పి కార్యాలయంలో సంతకం చేసి వెళ్తున్నారు. పోలింగ్ సందర్భంగా జరిగిన అల్లర్లలో పోలీసులు 161 కేసులు నమోదు చేసి 1320 మందిని అరెస్టు చేశారు. గత నెల 11 నుంచి జిల్లాలో 144 సెక్షన్ కొనసాగుతోంది. పల్నాడు జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి ఈ నెల 5వ తేదీ వరకు దుకాణాలను మూసివేయాలని పోలీసు మిగతా 2లో

అవాంతరాలకు తావులేదు

- పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపులో ఇసి ఆదేశాలు పాటించాలి
- సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఎటువంటి అవాంతరాలకు తావు లేకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. అవాంతరాలు కలిగించేందుకు ప్రయత్నించే వారిని నిర్దాక్షణ్యంగా బయటకు పంపడమే కాకుండా చట్టపరంగా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమ ఏర్పాట్లపై సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఓట్ల లెక్కింపు జరిగే రోజుతోపాటు ముందు, తదుపరి రోజుల్లో భావోద్వేగాలు అదుపు తప్పే అవకాశం ఉందన్నారు. ఉద్రిక్త పరిస్థితులు ఉత్పన్నం కాకుండా, వాటి ప్రభావం ఓట్ల లెక్కింపు కార్యక్రమాలపై ఉండకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు విషయంలో ఇసిఐ ఆదేశాలను పాటించాలని ఆదేశించారు. ఇవిఎంల కౌంటింగ్ పూర్తయిన వెంటనే అదేరోజు ప్రతి ఇవిఎంకు సీల్ వేసి భద్రపర్చాలని, వాయిదా వేయొద్దని అన్నారు. ఫలితాల ప్రకటనకు సంబంధించిన ఫారం-21సి/21ఇ ఓట్ల లెక్కింపు దినానికి మరుసటి రోజే ఇసిఐకి చేరేలా చేపట్టాల్సిన చర్యలపై మార్గదర్శకాలను జారీ చేశామన్నారు. ఇండెక్సు కార్డులో ఎటువంటి మిగతా 2లో

మన్యంలో ప్రమాద ఘంటికలు

అల్లూరి జిల్లాలో పెరుగుతున్న జ్వర బాధితులు

కొద్ది రోజులుగా కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

ప్రజాశక్తి- పాడేరు, రంపచోడవరం, చింతూరు విలేకరులు (అల్లూరి జిల్లా)

మన్యంలో జ్వరాలు ప్రబలుతున్నాయి. వైరల్ జ్వరాలతో పాటు మలేరియా కేసులూ క్రమేపీ పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. అల్లూరి జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరుల్లోని ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులకు వారం రోజులుగా జ్వర బాధితులు పెరిగారు. జూన్ నెలలో ఈ జ్వరాల తీవ్రత మరింత పెరిగే అవకాశముందని వైద్యాధికారులు చెబుతున్నారు. మన్యంలో ప్రస్తుతం భిన్నమైన వాతావరణం ఉంది. తీవ్రమైన ఎండలతోపాటు కుండపోత వర్షాలూ పడుతున్నాయి. దోమలూ పెరుగుతున్నాయి. ఇప్పుడే ఆస్పత్రులకు జ్వర బాధితుల తాకిడి పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 62 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గడిచిన ఐదు నెలల కాలంలో 791 మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇవిగాకుండా అరకులోయ, రంపచోడవరం, చింతూరు ఏరియా ఆస్పత్రుల్లోనూ, పాడేరులోని సర్వజన ఆస్పత్రిలోనూ వందల కేసులు నమోదైనట్లు సమాచారం. కొద్ది రోజులుగా ఈ కేసులు క్రమేపీ పెరుగుతున్నాయి. జిల్లా కేంద్రం పాడేరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి గత శుక్రవారం పెద్ద సంఖ్యలో జ్వర బాధితులు వచ్చారు. ఒపిలో నమోదైన 90కిపైగా జ్వర బాధితుల్లో డాక్టర్ల సూచన మేరకు 27 మందికి మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఇక్కడ ఎవరికీ మలేరియా నిర్ధారణ కానప్పటికీ వైరల్ జ్వరాలు నమోదవుతున్నాయి. మినుములూరు పిహెచ్‌సిని 'ప్రజాశక్తి' సందర్శించగా సాధారణ జ్వరాలు నమోదవుతున్నట్లు వైద్యాధికారి డాక్టర్ వి.సాయి శ్రీ చెప్పారు. మే నెలలో ఎనిమిది మలేరియా పాజిటివ్ కేసులు నమోదైనట్టు తెలిపారు. రక్త పరీక్షల ద్వారా నిర్ధారించి రోగులకు తక్షణ వైద్య సేవలందిస్తున్నామని చెప్పారు.



చింతూరు ఆస్పత్రిలో జ్వర బాధితులు

రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో 95 కేసులు

రంపచోడవరం ఏరియా ఆస్పత్రి పరిధిలో జ్వరాల కేసులు పెరుగుతున్నాయి. మే నెలలో 95 కేసులు నమోదవగా ఐదుగురికి మలేరియా పాజిటివ్ వచ్చింది. వీరిలో ఇద్దరు చిన్నారులున్నారు. 'ఇప్పుడిప్పుడే జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. రోజుకు రెండు నుంచి ఐదు కేసులు వస్తున్నాయి. జ్వరాలతో వచ్చే వారి కోసం ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేకంగా వార్డు ఏర్పాటు చేశాం. మెరుగైన చికిత్స అందించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం' అని ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.లక్ష్మి తెలిపారు.

చింతూరులో ఇలా..

చింతూరు మండల పరిసర ప్రాంతాల్లో రోజురోజుకు జ్వరాల కేసులు పెరుగుతున్నాయి. మోతుగూడెం, పొల్లూరు, తోలుగొండ, తులసిపాక, లక్కవరం, గూడూరు, మదుగూరు ప్రాంతాల్లో ఏటా మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్నాయి. చింతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడు నెలల నుండి మలేరియా కేసులు గణనీయంగా పెరిగాయి. 46 కేసులు మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణయ్యాయి. మొత్తం 19,723 రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. చిన్నారులు, వృద్ధులకు టైఫాయిడ్ మిగతా 2లో

కేజ్రీవాల్ మళ్లీ జైలుకు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీహార్ జైలులో ఆదివారం లొంగిపోయారు. తీహార్ జైలుకు బయలుదేరే ముందు తన తల్లిదండ్రుల కాళ్లకు నమస్కరించి వారి నుంచి కేజ్రీవాల్ ఆశీర్వాదం తీసుకున్నారు. కేజ్రీవాల్‌తోపాటు ఆయన సతీమణి సునీత, కుమారుడు పల్కిత్, కుమార్తె హర్షిత, ఆప్ నాయకులు తీహార్ జైలు వద్దకు వచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు జైలుకు వెళు తున్నానని, నియంతృత్వానికి తలవంచేది లేదని కేజ్రీవాల్ అంతకుముందు ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం కేజ్రీవాల్ ఆప్ కేంద్ర కార్యాలయంలో పార్టీ శ్రేణులతో భేటీ అయ్యారు. అనంతరం రాజ్‌ఘాట్‌లోని మహాత్మ గాంధీ సమాధిని సందర్శించి, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఆ తరువాత కన్నాట్ ప్లేస్‌లోని ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించారు. జూన్ 5 వరకు జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. జూన్ 5న కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై నిర్ణయం తీసుకోనున్నారు. జూన్ ఒకటితో దేశంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తుది దశ ముగిసింది. అదే రోజు కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్ గడువు ముగియడంతో ఆదివారం లొంగిపోయారు.

రాబోయే కొత్త ప్రభుత్వం ఏదైనా

ప్రత్యేక హోదా కోసం కృషి చేయాలి

- లేకపోతే ప్రజలు క్షమించరు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- జిఓ 596ను మొదట వ్యతిరేకించింది సిపిఎం మాత్రమే
- దయేరియాపై ప్రత్యేక అధికారిని నియమించాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాబోయే ప్రభుత్వం ఏదైనా నీతి, నిజాయతీ, చిత్తశుద్ధితో ప్రత్యేక హోదా సాధించుకునేందుకు కృషి చేస్తేనే మనుగడ ఉంటుందని, లేనిపక్షంలో ప్రజలు క్షమించరని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయిన సందర్భంగా ఆదివారం ఉదయం విజయవాడలోని బాలోత్సవ భవన్లో ఆయన మీడియాతో మాట్లాడారు.



2014లో టిడిపి, 2019లో వైసిపి పదేళ్ల పాలనలో పన్నులు, భారాలు పెరిగాయని, వాటిని భరించలేనిస్థితికి ప్రజలు చేరుకున్నారని, ఎన్నికల్లోనూ అది కనిపిస్తోందని పేర్కొన్నారు. తరువాత వచ్చే ప్రభుత్వం పన్నులు, భారాలు తగ్గించకపోతే ప్రజలు ఐదేళ్లు కూడా చూడరని హెచ్చరించారు. కొత్త ప్రభుత్వం కేంద్రం నుండి రావాల్సిన నిధులను తీసుకొచ్చి రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. 2014 జూన్ 2న కేంద్రం విద్రోహం మొదలైందని, కేంద్రానికి దశదినకర్మ చేస్తేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని అన్నారు. ఈ పదేళ్లలో రాష్ట్రాభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని, 2019 ఎన్నికల ముందు ప్రత్యేక హోదా సాధించిందాకా విశ్రమించనని బాబు, 25 పార్లమెంటు సీట్లు గెలిపిస్తే హోదా తెస్తానని జగన్ ప్రకటించారని, అవన్నీ ఉత్తర కుమార ప్రగల్భాలుగా మిగిలాయని తెలిపారు. మాటల కోతలు తప్ప చేసిందేమీ లేదని అన్నారు. గత పదేళ్లలో ఎన్‌డిఎ, వైసిపి పాలకులు రాష్ట్రాన్ని శాపగ్రస్తంగా మార్చారని మిగతా 5లో

షేర్ మార్కెట్, సట్టా వ్యాపారం కోసమే

ఎగ్జిట్ పోల్స్ షేర్‌మార్కెట్, సట్టా వ్యాపారం కోసం జరిగేవని, అవి రియాలిటీని ప్రతిబింబిస్తున్నాయా లేదా అనేది అనుమానమేనని శ్రీనివాసరావు తెలిపారు. కొన్ని మీడియా సంస్థలు కూడా సట్టా బజార్ గురించి చర్చ చేస్తూ బెట్టింగులను ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల నాలుగు రోజుల్లో షేర్ మార్కెట్ పెరిగి కొద్దిమంది చేతుల్లోకి లక్షల కోట్లు వెళ్లిపోతాయని అన్నారు. దీన్ని తాము ఆమోదించడం లేదని పేర్కొన్నారు. ఎగ్జిట్‌పోల్స్ స్వభావం మారిన నేపథ్యంలో వాటికి విశ్వసనీయత తగ్గిందని తెలిపారు. అయినా ప్రజలిచ్చిన తీర్పును అంగీకరించాలని అన్నారు.

కలెక్టర్లకు అమిత్ షా ఫోన్లు

- ఇప్పటి వరకూ 150 మందితో సంభాషణ
- జైరాం రమేష్ వెల్లడి



న్యూఢిల్లీ : ఈ నెల 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాల వెల్లడి నేపథ్యంలో జిల్లా కలెక్టర్లకు హోం మంత్రి అమిత్ షా ఫోన్లు చేస్తున్నారని, ఇప్పటి వరకూ 150 మందితో మాట్లాడారని కాంగ్రెస్ నాయకులు జైరాం రమేష్ తెలిపారు. ఈ చర్య తీవ్రమైన బెదిరింపు అని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ నెల 1న ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'అవుట్ గోయింగ్ హోం మంత్రి అమిత్ షా జిల్లా మేజిస్ట్రేట్లు / జిల్లా కలెక్టర్లకు ఫోన్లు చేస్తున్నారు. ఇప్పటి వరకూ 150 మందితో సంభాషించారు. ఇది తీవ్రమైన బెదిరింపు. బిజెపి ఎంత నిరాశలో ఉందో చూపిస్తుంది. జూన్ 4న మోడీ, షా, బిజెపి నిష్క్రమిస్తున్నది. ఇండియా జనబంధన్ విజయం సాధిస్తుంది. అధికారులు ఎంతటి ఒత్తిడిలోనైనా రాజ్యాంగాన్ని అనుసరించాలి. వారు నిఘాలో ఉన్నారు' అని జైరాం రమేష్ పేర్కొన్నారు.

జైరాం రమేష్ విమర్శలపై ఎన్నికల సంఘం స్పందించింది. ఆదివారం సాయంత్రం ఏడు గంటలలోగా పూర్తి వివరాలు ఇవ్వాలని కోరింది. దీని ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నప్పుడు అధికారులంతా కమిషన్ డిప్యుటేషన్‌లో ఉంటారని, ఏ ఆదేశాల కోసమైనా వారు నేరుగా ఇసిని సంప్రదిస్తారని తెలిపింది. ఏ జిల్లా మేజిస్ట్రేట్ అమిత్‌షా ఫోన్ సంభాషణ గురించి తమకు తెలియజేయలేదని ఇసి పేర్కొంది.

మార్గదర్శకాలు పాటించండి

- ముందుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కించి ఫలితాన్ని ప్రకటించండి
- సిఇసిని కోరిన ఇండియా బ్లాక్ నేతలు

లోపలి పేజీలో..

అధికార పార్టీలదే విజయం

- సిక్కింలో ఎస్‌కెఎం, అరుణాచల్‌ప్రదేశ్‌లో బిజెపి గెలుపు



ప్రేమ్‌సింగ్ తమంగ్

గ్యాంగ్‌టక్ : సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీలే విజేతగా నిలిచాయి. ఆ రెండు రాష్ట్రాల ఫలితాలను ఆదివారం ఎన్నికల సంఘం ప్రకటించింది. సిక్కింలో సిక్కిం క్రాంతికారి మోర్చా (ఎస్‌కెఎం) మొత్తం 32 స్థానాలకు గాను 31 స్థానాల్లో విజయం సాధించింది. పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి ప్రేమ్‌సింగ్ తమంగ్ తాను పోటీ చేసి రెండు స్థానాల్లోనూ గెలిచారు. 58.38 శాతం ఓట్లను సొంతం చేసుకుంది. ఈ పార్టీ 2019లో 17 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. ప్రతిపక్ష పార్టీ, సిక్కింను 2019 వరకూ 25 ఏళ్ల పాటు పాలించిన సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎస్‌డిఎఫ్) ఒక్క స్థానాన్ని మాత్రమే దక్కించుకోగలిగింది. సిక్కిం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, సిట్టింగ్ ఎమ్మెల్యే దిల్లి రామ్ థప ఉత్తర బుర్తుక్ నియోజకవరం నుంచి ఓడిపోయారు. 31 స్థానాల్లో పోటీ చేసిన బిజెపికి ఒక్క సీటూ దక్కలేదు. సిక్కింలో తొలి దశ లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా ఏప్రిల్ 19న జరిగాయి.

అరుణాచల్ ప్రదేశ్‌లో బిజెపి

అరుణాచల్‌ప్రదేశ్‌లో బిజెపి మళ్లీ అధికారాన్ని నిలబెట్టుకుంది. మొత్తం 60 స్థానాలకుగాను 46 స్థానాల్లో గెలుపొందింది. తొలిదశలో భాగంగా ఏప్రిల్ 19న ఈ రాష్ట్రంలో 50 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అంతకుముందే బిజెపి 10 స్థానాల్లో ఏకగ్రీవంగా గెలిచింది. ఎన్నికలు జరిగిన 50 స్థానాల్లో బిజెపి 36 స్థానాలను గెలుచుకుంది. ప్రస్తుత ముఖ్యమంత్రి పేమ ఖండు మరోసారి ఈ పదవిని చేపట్టే అవకాశం ఉంది. బిజెపి భాగస్వామ్య పార్టీ నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి)కి ఐదు స్థానాలను దక్కించుకుంది. పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్‌ప్రదేశ్ రెండు స్థానాల్లోనూ, ఎన్‌సిపి మూడు స్థానాల్లోనూ గెలిచాయి. ఎన్‌పిఇపి 5 స్థానాల్లోనూ, కాంగ్రెస్ ఒక్క స్థానం, ఐఎన్‌డి మూడు స్థానాల్లోనూ విజయం సాధించాయి.


ఓ 'బినామీ' అక్రమాలు!

- ఏడాదిగా అసైన్డ్ భూములు కొనుగోలు
- పోలీస్, రెవెన్యూలో చక్రం తిప్పుతున్న వైనం

ప్రజాశక్తి- భోగాపురం/విజయనగరం ప్రతినిధి

ఆయనకు భూములు కొనుగోలు చేయడమంటే సంతలో కోడిపిల్లలను కొన్నంత సులువు. భోగాపురం ప్రాంతంలో అందరూ తొలుత ఆయనను రియల్ ఎస్టేట్ వ్యాపారి అనుకున్నారు. భూ సామ్రాజ్యాన్ని విస్తరించాక తెలిసింది ఆయన వ్యాపారి కాదు... కొందరు పెద్దల బినామీ అని. బహుశా అందుకేనేమో భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ, నెల్లిమర్ల మండలాల్లో పోలీస్, రెవెన్యూ యంత్రాంగం ఆయన గుప్పెట్లో ఉంటుంది. అసైన్డ్ భూముల అడ్డగోలు కొనుగోలు వెనుక రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన పెద్దలు, అత్యున్నతాధికార్లు ఉన్నారన్న అభియోగాలు వస్తున్న నేపథ్యంలో ఓ బినామీ బాగోతాలపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

ఈ వ్యక్తి భోగాపురం ప్రాంతానికి పదేళ్ల క్రితమే వచ్చాడు. సముద్రతీరంలో చిన్న రిసార్ట్ ఏర్పాటు చేసుకొని కంచేరు రెవెన్యూ పరిధిలో తన పేరున కొన్ని భూములను కొనుగోలు చేశాడు. అప్పట్లో ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారని చాలామంది అనుకునేవారు. కొన్నాళ్ల తరువాత తెలిసింది ఆయన కొందరు ఉన్నతాధికారులు, పెద్దలకు బినామీ అని. ఏడాది క్రిందట నుంచి విచ్చలవిడిగా డి-పట్టా భూములు కొనుగోలు చేశాడు. అసైన్డ్ భూములు జిరాయితీలుగా మారుతాయన్న విషయం ముందుగానే తెలుసుకున్న ఆయన మండలంలోని కంచేరు, కొంగవానిపాలెం, గూడెపువలస, పోలిపల్లి తదితర గ్రామాల్లో అసైన్డ్ పట్టాదారులను లోబరుచుకుని ఎకరా రూ.కోట్లు విలువ చేసే భూములకు రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షలు ఎరజూపి తన పేరున పురోణీలు రాయించుకున్నాడు. భూముల విలువ బాగా పెరుగుతుందని భావించిన ఆ వ్యక్తి తన సామ్రాజ్యాన్ని అటు పూసపాటిరేగ, డెంకాడ మండలాలు, ఇటు విశాఖ జిల్లాలోని భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాల్లోనూ విస్తరించాడు భూమి విక్రయించడానికి ముందుకు వచ్చిన అసైన్డ్ పట్టాదారుని పేరు మాత్రమే రెవెన్యూ అధికారులతో ఫ్రీ హోల్డ్ ఇప్పించుకునేవారని ఈ ప్రాంతంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ అయ్యేలోపు 99 ఏళ్ల లీజుకు తీసుకున్నట్లు అసైన్డ్‌దారులతో పక్కాగా డాక్యుమెంటేషన్ చేయించుకున్నాడని సమాచారం. ఈ ప్రక్రియలో ఎదురైన అడ్డంకులను తొలగించుకునేందుకు మొత్తం నెల్లిమర్ల నియోజకవర్గంలోని పోలీస్, రెవెన్యూ వ్యవస్థలను తన గుప్పెట్లో పెట్టుకొన్నాడు. కొంగవానిపాలెం రెవెన్యూ పరిధిలో డి-పట్టా భూములు అధికంగా ఉన్నాయి. ఇక్కడ ఆయన సుమారు 40 ఎకరాలు కొనుగోలు చేశారని స్థానికులు అంటున్నారు. మరో 50 ఎకరాల భూమి కొనుగోలుకు కరసరత్తు జరుగుతోందని తెలిసింది. ఇంతలో మరొకరు ఆ భూములను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా, విషయం తెలుసుకున్న ఆ బినామీ ఇందుకు సహకరించారన్న అనుమానంతో సంబంధిత సర్వేయర్‌ను బదిలీ చేయించాడు. సాధారణంగా ఒక పోలీస్ అధికారి నియోజకవర్గ స్థాయిలో పనిచేయాలంటే ఎమ్మెల్యే అనుమతితో వస్తుంటారు. కానీ, ఇక్కడికి మాత్రం అమరావతిలోని ఒక ఉన్నతస్థాయి అధికారి సిఫార్సుతో రావడం గమనార్హం. అందరూ అనుమానించినట్టే ఆయన వచ్చిన నుంచీ ఈ బినామీకి అన్ని విధాలా సహకరించారన్న అభియోగాలు ఉన్నాయి. ఒక గ్రామ రెవెన్యూ పరిధిలో ఈ బినామీ గతంలో భూములు కొనుగోలు చేసినప్పుడు డబ్బులు చెల్లించకుండానే డాక్యుమెంట్లు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. నిరాకరించిన భూ విక్రయదారుడిపైకి పోలీసులను ఉసిగొల్పాడు. సంబంధిత పోలీస్ అధికారి ఒక దఫా ఫోన్‌లోనూ, మరోసారి ఇంటికి పోలీసులను పంపి బెదిరించాడు. ఇలాంటి ఉదంతాలెన్నో!



ఐస్‌ల్యాండ్ అధ్యక్షురాలిగా హల్లా తోమస్‌దత్తిర్ ఎన్నిక

లండన్ : ఐస్‌ల్యాండ్ అధ్యక్ష ఎన్నికల్లో హల్లా తోమస్‌దత్తిర్ విజయం సాధించారు. ఈ నెల 1న ఈ ఎన్నికలు నిర్వహించారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో వ్యాపారవేత్త, పెట్టుబడిదారు అయిన హల్లా తోమస్‌దత్తిర్ 34.3 శాతం ఓట్లతో ఎన్నికయ్యారు. మాజీ ప్రధానమంత్రి కత్రిన్ జకోబస్దోత్తిర్‌కు 25.2 శాతం, హల్లా ఫ్రుండ్ లగోడోత్తిర్‌కు 15.5 శాతం ఓట్లు లభించాయి. వీరు ముగ్గురూ మహిళలే. హల్లా తోమస్‌దత్తిర్ ప్రస్తుత అధ్యక్షులు గుడ్ని థ్ జోహన్నెసన్ స్థానంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆగస్టు 1న ఆమె ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఐస్‌ల్యాండ్ ప్రస్తుతం అనేక యూరప్ దేశాల మాదిరిగానే ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో వ్యాపారవేత్త అయిన హల్లా తోమస్‌దత్తిర్ అధ్యక్షురాలిగా ఎన్నికకావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

కేంద్రంలో ఎన్‌డిఎ ఓటమి ఖాయం

- 'అవినీతి చక్రవర్తి నరేంద్ర మోడీ' పుస్తకావిష్కరణలో పరకాల ప్రభాకర్
- రిగ్గింగు కోసమే ఎగ్జిట్ పోల్స్‌లో తప్పుడు లెక్కలు
- ఒక్కో ఎలక్టోరల్ బాండు వెనుక ఒక పెద్ద కుంభకోణం



'అవినీతి చక్రవర్తి నరేంద్ర మోడీ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పరకాల ప్రభాకర్, వడ్డే శోభనాద్రీశ్వరరావు, కేశవరావు, ఝాన్సీ తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలో ఎన్‌డిఎ ఓటమి ఖాయమని, కౌంటింగ్‌లోనూ రిగ్గింగు చేసుకునేందుకే ఎగ్జిట్‌పోల్స్‌లో ఎన్‌డిఎ అధికారంలోకి వస్తున్నట్లు తప్పుడు లెక్కలు రాయించారని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ అన్నారు. రైతు ఉద్యమ నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు రాసిన 'అవినీతి చక్రవర్తి నరేంద్ర మోడీ - ఎలక్టోరల్ బాండ్ల స్కాము అందులో కొద్ది భాగమే' పుస్తకాన్ని ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. రైతు, ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు నడిపిన వడ్డే శోభనాద్రీశ్వరరావు రాసిన ఈ పుస్తకంలో ఎంతో విలువైన సమాచారం ఇచ్చారని తెలిపారు. ప్రత్యేకించి ఎలక్టోరల్ బాండ్ల మీద సమగ్ర సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. ఒక్కో బాండు వెనుక ఒక్కో కుంభకోణం ఉందని, ఆ వివరాలన్నీ ఇందులో పొందుపరిచారని అన్నారు. ఒక్క ఎలక్టోరల్ బాండ్లపైనే కాకుండా మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన అనేక అవినీతి వ్యవహారాలను పూర్తిగా వివరించారని పేర్కొన్నారు. ఈ పుస్తకాలను లక్షల సంఖ్యలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎన్నికలు అయిపోయాయని ఆలోచించాల్సిన అవసరం లేదని, ఎగ్జిట్‌పోల్స్ చూసి నిరాశపడాల్సిన అవసరం లేదని వివరించారు. వాటిల్లో చాలా వరకూ బోగస్ అని, ఎక్కువ సీట్లు ఎన్‌డిఎకు వస్తున్నట్లు కావాలని చేయించిన సర్వేలని, వాటిని నమ్మాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కేంద్రంలో ఎన్‌డిఎ ఓటమి ఖాయమని, దేశ ప్రజలు అందుకు సిద్ధంగా ఉన్నారని, ప్రతిపక్షాలు ఐక్యంగా పనిచేశాయని వివరించారు. అయితే ఎన్‌డిఎ అంత తేలికగా అధికారాన్ని వదులుకోదని, కౌంటింగ్‌లో రిగ్గింగుకు వీలుగా సర్వేలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో పార్టీలన్నీ కౌంటింగ్‌ను సక్రమంగా చేసుకోవాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ నుండి అన్ని రకాల వ్యవస్థలనూ వారు చేతుల్లో పెట్టుకున్నారని, ఈ నేపథ్యంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఇండియా వేదిక గెలుస్తుందని అభిప్రాయం దేశవ్యాప్తంగా వ్యక్తమవుతోందని అన్నారు. అయినా మోడీ ఆటలు, మాటలను నమ్మడానికి వీల్లేదని, ఇంత బహిరంగంగా అబద్ధాలు చెప్పే ప్రధానిని ఇంతవరకు దేశచరిత్రలో చూడలేదని అన్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినా ప్రజా, రైతు సమస్యలపై పోరాడి హక్కులు సాధించుకోవాలని సూచించారు.

పుస్తక రచయిత శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. ప్రధాని చెప్పేవన్నీ అబద్ధాలేనని, వ్యవసాయ రంగాన్ని తుడిచిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, అతన్ని నమ్మాల్సిన అవసరం లేదని, ఓడించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాబోయే కాలంలో నిర్వహించే పోరాటాల్లో రైతుల సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో వామపక్షాల సాయంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ, ఆహారభద్రతా చట్టం వంటి మంచి పనులు చేసిందని అన్నారు. ప్రస్తుతం రైతాంగ సమస్యల పరిష్కారం కోసం హామీ ఇచ్చిందని చెప్పారు. ఇండియా వేదిక అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీలను సాధించుకోవాల్సిన అవసరం ఉందని, దీనికోసం అవసరమైతే పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి కూడా రాష్ట్రానికి హోదా ఇస్తానన్న ఇండియా వేదికకు మద్దతు తెలపాలని, ఎన్‌డిఎ కూటమి నుండి బయటకు రావాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ.. వడ్డే శోభనాద్రీశ్వరరావుకు 50 ఏళ్ల రాజకీయ జీవితం ఉందని, కేంద్రానికి వ్యతిరేకంగా జరుగుతున్న అనేక పోరాటాల్లో ఆయన కీలక పాత్రధారిగా ఉన్నారని అన్నారు. వడ్డే రాసిన పుస్తకం ఎంతో విలువైందని, దీన్ని ఆవిష్కరించేందుకు పరకాల రావడం సంతోషకరంగా ఉందని చెప్పారు. రైతు స్వరాజ్యవేదిక నాయకులు విస్సా కిరణ్ మాట్లాడుతూ.. దేశంలో మోడీ అంత దౌర్భాగ్య ప్రధానిని మరొకరిని చూడలేదని అన్నారు.

రైతు సంఘం (దాసరి భవన్) రాష్ట్ర కార్యదర్శి కెవివి ప్రసాదు మాట్లాడుతూ.. వడ్డే రాసిన పుస్తకంలో ఎంతో విలువైన సమాచారం ఉందని, దీనివల్ల మోడీ అవినీతిని ప్రజలకు తెలియజెప్పాలని కోరారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ.. రైతాంగ ఉద్యమంలో ఎంతో అనుభవం ఉన్న వడ్డే శోభనాద్రీశ్వరరావు పుస్తకాన్ని చదవడం ద్వారా మోడీ దురాగతాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. రైతు నాయకులు చుండూరి రంగారావు, రైతు కూలీ సంఘం నాయకులు హరినాథ్, నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్, భారత్ బచావో నాయకులు చిగురుపాటి భాస్కరరావు తదితరులు మాట్లాడారు. రిటైర్డు ఐఎఎస్ అధికారి బండ్ల శ్రీనివాసరావు వందన సమర్పణ చేశారు.



విశాఖలోని చావులమదుం వద్ద భారీగా చేరిన వర్షపు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

'నైరుతి' వచ్చేసింది

- రాయలసీమ, కోస్తా జిల్లాల్లోకి 3 రోజుల ముందే
- 5వ తేదీ నాటికి రాష్ట్రం అంతటా విస్తరించే అవకాశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో, యంత్రాంగం

రాష్ట్రంలోకి మూడు రోజుల ముందే నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఆదివారం రాయలసీమ, కొన్ని కోస్తా జిల్లాల్లోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. రేమాల్ తుపాను పూర్తిగా బెంగాల్ వైపు మళ్లడంతో నైరుతి రుతుపవనాలు చురుగ్గా రాష్ట్రం వైపు కదిలాయి. ఈ నెల 5వ తేదీ నాటికి రాష్ట్రం అంతటా రుతుపవనాలు విస్తరించనున్నాయని వాతావరణశాఖ తెలిపింది. ఈ మేరకు ఎఎన్‌డి నివేదిక మేరకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. దక్షిణ కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడు ప్రాంతాల్లో ఆవర్తనం కొనసాగుతుందని తెలిపారు. జూన్ నెలలో సాధారణం కంటే ఎక్కువ సగటు వర్షపాతం నమోదయ్యే అవకాశం వుందన్నారు. జూన్ నుండి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షాలకు మించి వర్షాలు నమోదయ్యే అవకాశం వుందని పేర్కొన్నారు.

నైరుతి రుతుపవనాల ప్రభావంతో తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో 53.7 మిల్లీమీటర్లు, అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో 47.7, చిత్తూరు జిల్లా పుంగనూరులో 33, అనంతపురం జిల్లాలోని రాయదుర్గం 35.6, కనేకల్ మండలంలో 17, బొమ్మనహాల్ మండలంలో 27.2, గుమ్మగట్ట మండలంలో 25.8 మిల్లీమీటర్లు, కాకినాడ జిల్లా పెదపూడి, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరిలో కూడా వర్షాలు పడ్డాయి. శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో గంటపాటు భారీ వర్షం కురిసింది. టెక్కలిలో ఈదురుగాలుల ధాటికి రైల్వే ట్రాక్‌పై చెట్టు కూలడంతో పూరీ నుంచి గుణుపూర్ వెళ్తున్న రైలు ఐదు నిమిషాల పాటు నిలిచిపోయింది. విశాఖలో అక్కయ్యపాలెం, జగదాంబ, వన్‌టౌన్, మద్దిలపాలెం, శివాజీపాలెం, కంచరపాలెం, జ్ఞానాపురం ప్రాంతాల్లో జోరువాన కురిసింది. ఈదురుగాలులకు నందగిరినగర్ కాలనీలో చెట్టు కూలి కారుపై పడడంతో వాహనం పాక్షికంగా ధ్వంసమైంది. చావులమధుం సహా పలు లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు చేరింది. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోనూ పలుచోట్ల వర్షం కురిసింది.

పిడుగుపాటుకు నలుగురు మృతి

పిడుగుపాటుకు నలుగురు మృతి చెందారు. విశాఖపట్నానికి చెందిన మత్స్యకారులు పోలరాజు (23), కర్రి అప్పన్న, మైలపల్లి గురయ్యలు కలిసి సంప్రదాయ బోటుపై చేపలవేటకు బయలుదేరుతుండగా ఫిషింగ్ హార్బర్ నాలుగో జెట్టీ వద్ద పిడుగుపడింది. ఈ ప్రమాదంలో పోలరాజు మృతి చెందగా, గాయపడిన మిగతా ఇద్దరూ చికిత్స పొందుతున్నారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరంలో జెట్టీల వద్ద అలలు ఎక్కువగా ఉన్నాయని తెలిసి తమ బోట్లను పరిశీలించడానికి వెళ్లిన ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు కంబాల ముత్యాలు (48) వెళ్లారు. ఆ సమయంలో ఆయనకు సమీపంలో పిడుగుపడడంతో మరణించారు. పల్నాడు జిల్లా ఎడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన రైతు పెద్ది చిన్న వీరయ్య (50), తన పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నేందుకు డ్రైవర్ శ్రీనివాసరావు (50)ను తీసుకువచ్చారు. పొలం దున్నుతున్న సమయంలో వర్షం పడడంతో ఇద్దరూ ట్రాక్టర్ దిగి సమీపంలోని చెట్టు కిందకు చేరుకున్నారు. ఆ చెట్టుపై పిడుగుపడడంతో ఇరువురూ అక్కడికక్కడే మృతిచెందారు. తిరుపతి జిల్లా పుత్తూరు మండలం, జయరాణిపురం గ్రామంలో చింతచెట్టుపై పిడుగుపడడంతో ఆ చెట్టు కింద కట్టి ఉంచిన ఐదు పాడి ఆవులు మృత్యువాతపడ్డాయి.

సునీతా విలియమ్స్ రోదసి యాత్ర మళ్లీ వాయిదా



వాషింగ్టన్: బోయింగ్ సంస్థకు చెందిన స్టార్‌లైనర్ వ్యోమనౌక ప్రయోగం మరోసారి వాయిదాపడింది. అమెరికా కాలమానం ప్రకారం శనివారం ఈ ప్రయోగానికి రంగం సిద్ధంకాగా; చివరి నిమిషంలో ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాల్సి వచ్చింది. ఇందులో భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని (ఐఎస్‌ఎస్)కి పయనం కావాల్సింది. ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్‌లో ప్రయోగానికి సరిగ్గా 3 నిమిషాల 50 సెకన్ల ముందు కౌంట్‌డౌన్‌ను కంప్యూటర్ వ్యవస్థ నిలిపివేసింది. దీనికి కారణాలు ఇంకా వెల్లడి కాలేదు. డేటాను విశ్లేషిస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ ప్రయోగం ఆదివారం జరిగే అవకాశం ఉంది. గత నెల 6న ఈ వ్యోమనౌక ప్రయోగానికి తొలి ప్రయత్నం జరిగింది. లీకేజీల సమస్య కారణంగా అది వాయిదా పడింది. యునైటెడ్ లాంచ్ అలయన్స్‌కు చెందిన 'అట్లాస్-5' రాకెట్ ద్వారా స్టార్‌లైనర్‌ను నింగిలోకి పంపాల్సి ఉంది. నిజానికి ఈ యాత్ర ఎన్నో ఏళ్ల కిందట జరగాల్సింది. సాంకేతిక సమస్యల కారణంగా అది వాయిదా పడుతూ వస్తోంది.

అవాంతరాలకు తావులేదు

(మొదటి పేజీ తరువాయి)

తప్పులకూ ఆస్కారం లేకుండా ఎంతో జాగ్రత్తగా ఆ కార్డును పూరించాలని పేర్కొన్నారు. ఆయా కార్డులన్నీ ఈ నెల 8లోపు తమ కార్యాలయానికి అందించాలని ఆదేశించారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద ఒక ఏజెంట్‌ను నియమించుకునే అవకాశాన్ని కల్పించాలని చెప్పారు. ఆర్ఓ టేబుల్ వద్ద అభ్యర్థి లేనప్పుడు మాత్రమే ఒక ఏజెంట్‌కు అవకాశం కల్పించాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చే ఏజెంట్ చేతిలో ఫారం-17సి, పెన్ను, పేపర్ మాత్రమే ఉండేలా చూడాలన్నారు. అథారిటీ లేఖలు కలిగిన పాత్రికేయులందర్నీ మీడియా కేంద్రంలోకి అనుమతించాలని చెప్పారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలన్నీ ఫైర్ సేఫ్టీ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, అందుకు తగ్గట్టుగా అగ్నిమాపకశాఖ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా పొందాలని చెప్పారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా ప్రణాళిక బద్ధంగా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు సిఇఒలు పి కోటేశ్వరరావు, ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జాయింట్ సిఇఒ ఎస్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి కోసమే నేషనల్ మీడియా హడావుడి

- క్షేత్రస్థాయిలో వేరు : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమికి ఎక్కువ స్థానాలు వస్తాయని జాతీయ మీడియా సంస్థలు ఢిల్లీలో కూర్చొని చెప్పిన ఎగ్జిట్ పోల్స్ విశ్వసనీయత లేనివిగా వున్నాయని, క్షేత్రస్థాయిలో స్థానిక సర్వే సంస్థలు అందుకు విరుద్ధంగా ఇచ్చాయని పార్టీ శ్రేణులకు వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్లకు జూమ్ ద్వారా శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బిజెపి 400 స్థానాలను గెలవాలనే మొదటి నుండి చెబుతున్న లక్ష్యానికి అనుగుణంగా జాతీయ మీడియా సంస్థలు కథలను అల్లాయని విమర్శించారు. పొరుగున వున్న తమిళనాడులో బిజెపి పోటీ చేసిందే తొమ్మిది స్థానాలైతే జాతీయ మీడియా సంస్థలు 14 స్థానాల్లో బిజెపి గెలవబోతుందని ఇచ్చాయని, వారి ఎగ్జిట్ పోల్స్ తప్పు అని అనడానికి ఈ ఉదాహరణ చాలని తెలిపారు. ఇలా నాలుగైదు రాష్ట్రాల్లో బిజెపికి అనుకూలంగా తప్పుడు సమాచారం ఇచ్చాయని విమర్శించారు. ఇసిని బెదిరించి పబ్బం గడుపుకోవాలని చంద్రబాబు చూస్తున్నారని ఆరోపించారు.

క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరుగా వున్నాయని, ఎవరూ ఆందోళన చెందొద్దని అన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో కౌంటింగ్ ఏజెంట్లు ప్రతి ఓటునూ విలువైందిగా చూడాలన్నారు. ప్రధానంగా పోస్టల్ బ్యాలెట్‌లలో ఎక్కువగా అవకతవకలు జరిగే అవకాశం వుందని, అప్రమత్తంగా వుండాలని తమ ఏజెంట్లకు చెప్పామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై ఉన్న అధికారి సంతకం విషయంలో అనుమానం ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

తిరుగులేని విజయం తథ్యం

- కౌంటింగ్ రోజు అల్లర్లకు వైసిపి ప్రణాళికలు
- కూటమి ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులతో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల ఫలితాల్లో కూటమి తిరుగులేని విజయం సాధిస్తుందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. విజయం కోసం మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు మంచి సమన్వయంతో పనిచేశారని అన్నారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి కూటమి ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులతో చంద్రబాబు జూమ్ ద్వారా మాట్లాడారు. కౌంటింగ్ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై నేతలకు పలు సూచనలు చేశారు. ఎగ్జిట్ పోల్స్ అన్నీ కూటమి విజయం వైపే మొగ్గు చూపించాయని, కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని అన్నారు. ఓటమి భయంతోనే కౌంటింగ్‌పై వైసిపి అర్థం లేని ఆరోపణలు చేస్తోందన్నారు. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్‌పై ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలపైనా కోర్టుకు వెళ్లి హంగామా చేయాలని చూసిందని వ్యాఖ్యానించారు. కౌంటింగ్ రోజు కూడా అనేక అక్రమాలు, దాడులకు తెగబడే అవకాశం ఉందన్నారు. కూటమి ఏజెంట్లు, అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాలకు చీఫ్ ఎన్నికల ఏజెంట్లు, పోలింగ్ ఏజెంట్లు సమయానికి చేరుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించేలా కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు పనిచేయాలని చెప్పారు. ఇవిఎంలను స్ట్రాంగ్‌రూమ్‌ల నుంచి తీసుకొచ్చే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పూర్తిస్థాయి ఫలితాలు వచ్చే వరకూ ఎవరూ అశ్రద్ధ వహించొద్దన్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు ప్రతి ఏజెంట్ కౌంటింగ్ కేంద్రంలోనే ఉండాలని సూచించారు. రిటర్నింగ్ అధికారి వద్ద డిక్లరేషన్ ఫాం తీసుకున్న తర్వాతే అభ్యర్థులు కౌంటింగ్ గది నుంచి బయటకు రావాలని సూచించారు. రాష్ట్రంలో 53 శాతం ఓట్లతో ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని బిజెపి ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ అన్నారు. ప్రతి అభ్యర్థి లీగల్ టీమ్‌ను అందుబాటులో ఉంచుకోవాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి, జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

పాయల్ కపాడియాపై కేసులు ఎత్తివేయాలి

- పద్మశ్రీ పురస్కారం ఇవ్వాలి
- ప్రజానాట్య మండలి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రముఖ ఫిల్మ్ మేకర్ అయిన పాయల్ కపాడియా రూపొందించిన ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్ చిత్రానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన కేన్స్ గ్రాండ్ ప్రిక్స్ అవార్డు దక్కడం దేశానికే గర్వకారణమని ప్రజానాట్య మండలి పేర్కొంది. ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్న పాయల్ కపాడియాపై వున్న అక్రమ కేసులను ఎత్తివేసి పద్మశ్రీ పురస్కారంతో ఆమెను గౌరవించాలని డిమాండ్ చేసింది. ఆదివారం పూలే-అంబేద్కర్ భవనంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు వొరప్రసాద్ మాట్లాడుతూ.. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం, నిర్బంధాలకు గురిచేయడం బిజెపి ప్రభుత్వ పాలనలో సర్వసాధారణమైందన్నారు. ఈ పదేళ్ళ కాలంలో కవులు, కళాకారులు, రచయితలపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. బిజెపి భావజాలానికి వ్యతిరేకంగా వుందని కపాడియాకి స్కాలర్‌షిప్ ఆపేసి, ఎఫ్‌టిఐఐ నుండి సస్పెండ్ చేసినా ఆమె ధైర్యం కోల్పోలేదన్నారు. కేన్స్ ఉత్సవాలలో మొదటి భారతీయ మహిళా దర్శకురాలిగా బహుమతి పొందడం దేశానికి గర్వకారణమని అన్నారు. అంతర్జాతీయంగా దేశప్రతిష్టతను పెంచిన పాయల్ కపాడియాపై వున్న కేసులు ఎత్తివేసి పద్మశ్రీ పురస్కారం ఇవ్వడం సముచితమన్నారు. పోలవరపు సాంస్కృతిక వేదిక బాధ్యులు గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ.. 38 ఏళ్ల పాయల్ కపాడియా ఎఫ్‌టిటిఐ ప్రతిష్టను నిలబెట్టారని తెలిపారు. ప్రధాని మోడీ సైతం ప్రశంసలు కురిపించిన పాయల్ కపాడియాపై వున్న కేసులు ఎత్తి వేయాలన్నారు. మనువాదాన్ని విమర్శించే వారందరినీ దేశ ద్రోహులుగా భావించడం తగదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్ మాట్లాడుతూ.. పాయల్ కపాడియా మదనపల్లెలోని రుషివ్యాలీ స్కూల్లో చదవడం ద్వారా మన రాష్ట్రంతో అనుబంధం కలిగి ఉన్నారన్నారు. 2015లో ఎఫ్‌టిఐఐ ఛైర్మన్‌గా బిజెపి నేత, సినీ నటుడు గజేంద్ర చౌహాన్ నియామకాన్ని ఆమె ప్రశ్నించడమే తప్పు అన్నట్లు ఆమెపై కేసులు నమోదు చేయడం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణ, తెలుగు షార్ట్ ఫిల్మ్ కార్యదర్శి డివి రాజు, ఎంబివికె బాధ్యులు యువి రామరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ మల్లెల త్రివేది, కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు తదితరులు మాట్లాడారు.

మన్యంలో ప్రమాద ఘంటికలు

(మొదటి పేజీ తరువాయి)

జ్వరాలు సోకుతున్నాయి.

టైఫాయిడ్‌తో బాధపడుతున్నాను

ఒంట్లో బాగోకపోతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకున్నాను. టైఫాయిడ్ అని తేలింది. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. మందులు వాడుతున్నాను.

-ఎల్లమ్మ, వీరాపురం గ్రామం, చింతూరు మండలం

మా పాపకు మెరుగైన వైద్యం అందించాలి



నాలుగు రోజుల నుంచి మా పాప అనారోగ్యంతో బాధపడుతోంది. పరీక్షలు చేయించగా టైఫాయిడ్‌గా తేలింది. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్నాం. ఇంకా మెరుగైన వైద్యం అందించాలి. జ్వరాల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

-మిడియం మల్లమ్మ, చెడుమూరు గ్రామం, చింతూరు మండలం

అప్రమత్తంగా ఉన్నాం



జిల్లాలో మలేరియా హైరిస్క్ గ్రామాలను గుర్తించి ఏప్రిల్ 15 నుంచి మే 31 వరకు దోమల నివారణ మందు తొలి రౌండు పిచికారీ కార్యక్రమం చేపట్టాం. ఇప్పటి వరకూ జిల్లాలోని పిహెచ్‌సిల్లో 791 మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. మలేరియా నియంత్రణలో భాగంగా హైరిస్క్ పరిధిలో ఉన్న 1,767 గ్రామాలను ఎంపిక చేసి చర్యలు చేపట్టాం. ఇప్పటి వరకూ 1,499 గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ పూర్తయింది. వర్షరుతువు మొదలయ్యాక జూన్ నుండి జులై వరకూ, అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ తప్పనిసరిగా మరో రెండు విడతలుగా పిచికారీ చర్యలు చేపట్టాలి. జ్వర బాధితులు అలక్ష్యం చేయకుండా తక్షణమే రక్త పరీక్షలు చేసుకొని తగు చికిత్స పొందాలి. జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉన్నాం. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

-డాక్టర్ సి.జమాల్ బాషా, జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి

పల్నాడులో భయం... భయం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు వ్యాపారులను ఆదేశించారు. అన్ని పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఎస్‌పిల ఆధ్వర్యంలో ప్రజల్లో భరోసా నింపేందుకు మార్చ్‌ఫాస్టు ర్యాలీలు నిర్వహించారు. జిల్లా ఎస్‌పి మల్లికా గర్గ్ ఓట్ల లెక్కింపు, ఫలితాల అనంతరం ఎక్కడా ఘర్షణలు జరగడానికి వీల్లేదని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

పెట్రోల్ బాంబుల తయారీ సామగ్రి

పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లిలోని గుర్రాల జగన్‌మోహన్‌రావుకు చెందిన మామిడి తోటలో అడిషనల్ ఎస్‌పి సోమశేఖర ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో చేపట్టగా గడ్డి వామిలో దాచిన నాలుగు లీటర్ల పెట్రోల్, 18 ఖాళీ సీసాలు, తొమ్మిది మద్యం సీసాలు లభ్యమయ్యాయి. నిందితుడిని, ఆయన తండ్రి సుధాకరరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

భూముల స్వాహాపై సిట్టింగ్ జడ్జితో విచారణ

- కెవిపిఎస్ రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఉత్తరాంధ్రలోని దళిత, గిరిజనుల అసైన్డ్ భూములు, స్వానుభవంలో ఉన్న భూముల అన్యాక్రాంతంపై రాష్ట్ర ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్రలోని దళిత, గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆదివారం విశాఖలోని సిఐటియు కార్యాలయంలో కెవిపిఎస్ ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ఈ నెల 4న ఎన్నికల ఫలితాల తరువాత రాష్ట్రంలో అధికారం చేపట్టే ప్రభుత్వం ఉత్తరాంధ్ర దళిత, గిరిజనుల, బలహీన వర్గాల అసైన్డ్ భూముల కబ్జాపై మొట్టమొదట స్పష్టంగా ఒక ప్రకటన చేయాలని, ఆ భూములను కాపాడేందుకు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విశాఖ ప్రాంతంలో జరిగిన భూ కుంభకోణాలపై గతంలో పాలించిన ప్రభుత్వాలు సిట్ ఏర్పాటు చేసినా ఎటువంటి ప్రయోజనమూ ఒనగూరలేదన్నారు. అసైన్డ్ భూ కబ్జాల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రమేయం ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో సిట్టింగ్ జడ్జి విచారణతోనే న్యాయం జరుగుతుందని, వాస్తవం వెలుగు చూస్తుందని పేర్కొన్నారు. అసైన్డ్ భూముల పేదలకు నష్టం కలిగించే 596 జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ అసైన్డ్ భూములు పొందిన పేదలకు, ముఖ్యంగా దళితులకు మేలు చేసేందుకే చట్టాన్ని తెచ్చామని చెబుతున్న ప్రభుత్వం తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో, సిఎస్ వంటి ఉన్నతోద్యోగి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రలోని దళితులకు చెందిన కోట్ల విలువైన అసైన్డ్ భూములు స్వాహాకు గురవుతున్నాయని విమర్శించారు. 'ఫ్రీ హోల్డ్'కు ముందే అసైన్డ్ భూములు పెద్ద మొత్తంలో పెత్తందార్ల పరమయ్యాయన్నారు. అంతోఇంతో మిగిలి ఉన్న భూములను సైతం ప్రభుత్వ సహకారంతో భూ బకాసురులు కాజేయడానికి రంగం సిద్ధం చేసుకున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్రలో ఫ్రీ హోల్డ్ జాబితా వెల్లడిలో కావాలనే తాత్సారం చేస్తున్నారన్నారు. కోట్లాది రూపాయల విలువైన భూములను కారుచౌకగా కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. విజయనగరం జిల్లాలో 6,500 ఎకరాలను ఫ్రీ హోల్డ్‌గా ప్రకటించాల్సి ఉండగా, ఇప్పటికి 2,500 ఎకరాలను మాత్రమే ఫ్రీ హోల్డ్‌గా చేశారన్నారు. ఆ జిల్లాలోని భోగాపురంలో అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం మరో ఏడాదిలో సిద్ధం కానుందన్న సమాచారంతో అక్కడ పెద్ద ఎత్తున భూస్వాహాలు జరుగుతున్నాయన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లు, ఒప్పందాలు ప్రభుత్వానికి తెలియవా? అని ప్రశ్నించారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్ మాట్లాడుతూ భీమిలి, ఆనందపురం మండలాల్లో దళితుల భూములను పెద్దలు స్వాహా చేస్తున్నారని తెలిపారు. దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పాల్తేటి పెంటారావు మాట్లాడుతూ విశాఖ జిల్లా కలెక్టర్, ఆనందపురం తహశీల్దారు సహకారం భూబకాసురులకు ఉందని ఆరోపించారు. ఈ సమావేశంలో దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు కొత్తపల్లి వెంకటరమణ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుబ్బన్న, టి.చిరంజీవి, ఉపాధ్యక్షులు వై.రాజు, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు పతివాడ రాంబాబు పాల్గొన్నారు.

ఎఆర్ మహిళా కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్


వేదవతి (ఫైల్)

అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఎఆర్ మహిళా కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి చెందిన సంఘటన కలకలం రేపింది. పోలీసుల వివరాల మేరకు.. ఎఆర్ మహిళా కానిస్టేబుల్ కె. వేదవతి (28) అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సెంట్రీగా విధులు నిర్వహిస్తున్నారు. రోజులాగే ఆదివారం యథావిధిగా డ్యూటీగా వచ్చారు. కొద్ది సమయం తర్వాత పేలిన శబ్దం వచ్చింది. పోలీసులు వెళ్లి చూడగా ఆమె మృతి చెంది ఉన్నారు. వేదవతి ఆత్మహత్యకు పాల్పడ్డారా? లేక గన్‌ఫైర్ అయిందా? కుటుంబ సమస్యలా? లేదా విధుల్లో ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారా? మరేమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. వేదవతికి భర్త, కుమార్తె ఉన్నారు.

తేనెటీగల దాడిలో ఉపాధి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - నరసాపురం (పశ్చిమగోదావరి జిల్లా)


నరసింహ స్వామి (ఫైల్)

తేనెటీగల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉపాధి కార్మికుడు మృతి చెందారు. ఈ సంఘటన పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. గొంది గ్రామానికి చెందిన ఉపాధి హామీ కార్మికుడు మోక నరసింహస్వామి (84) మే 30న గ్రామ సమీపంలో ఉపాధి పనులు చేస్తుండగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో నరసింహస్వామితోపాటు యర్రంశెట్టి నాగరాజు గాయపడ్డారు. అధికారులు వెంటనే వీరిని పాలకొల్లులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నరసింహస్వామి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరంలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు నలుగురు కుమార్తెలు, నలుగురు కుమారులు ఉన్నారు. నరసింహస్వామి మృతదేహాన్ని ఎంపిడిఒ ఎంవి.రమణరావు సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వశిష్ట గోదావరిలో పది కేజీల పండుగప్ప లభ్యం

ప్రజాశక్తి - నరసాపురం (పశ్చిమగోదావరి జిల్లా)


భారీ పండుగప్ప

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరం చినమార్కెట్‌లో ఆదివారం పది కేజీల పండుగప్ప అమ్మకానికి వచ్చింది. స్థానిక వశిష్ట గోదావరిలో మత్స్యకారులకు ఇది చిక్కింది. నరసాపురం పట్టణానికి చెందిన పలువురు బృందంగా ఈ పండుగప్పను రూ.5600కి కొనుగోలు చేశారు. గోదావరిలో పది కేజీలు పండుగప్ప దొరకడం అరుదని మత్స్యకారులు, వ్యాపారులు తెలిపారు.

కొడుకును తుపాకీతో కాల్చిన తండ్రి

- ఎఆర్ కానిస్టేబుల్ అరెస్ట్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రూ.20 వేలు డబ్బులు ఇవ్వాలని తన తండ్రిని కుమారుడు అడగడంతో తుపాకీతో కాల్చి చంపిన సంఘటన ఒంగోలులో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలు శ్రీనివాస కాలనీ ఒకటవ లైన్‌లో ఎఆర్ కానిస్టేబుల్ కొదమల ప్రసాద్ బాబు (52) నివసిస్తున్నారు. పట్టణంలోని భాగ్యనగర్ నాల్గవ లైన్‌లో ఇవిఎం, వివిప్యాడ్స్ భద్రపరిచే రిజర్వ్‌డ్ గోదాం వద్ద కొదమల ప్రసాద్ విధులు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి డ్యూటీ దగ్గర తన తండ్రిని ద్విచక్రవాహనంపై కుమారుడు శేషు కమల్ (20) వదిలిపెట్టారు. కుటుంబ అవసరాల కోసం రూ.20 వేలు డబ్బులు ఇవ్వాలని తన తండ్రిని కుమారుడు అడిగారు. డబ్బులు ఇవ్వనని చెప్పడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. గార్డు గదిలోకి వెళ్లి సర్వీస్ రైఫిల్ తీసుకొని కుమారుడిని తండ్రి కాల్చి చంపారు. అప్రమత్తమైన సిబ్బంది శేషు కమల్‌ను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు పరీక్షించిన వైద్యులు తెలిపారు. ప్రసాద్‌బాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వడదెబ్బకు మహిళ మృతి

ప్రజాశక్తి- వెదురుకుప్పం (చిత్తూరు జిల్లా)


వెంకటమ్మ (ఫైల్)

వడదెబ్బకు చిత్తూరు జిల్లాలో ఓ మహిళ మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గంగాధర నెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ, భోప్పలమడుగు గ్రామానికి చెందిన తాతిరెడ్డి వెంకటమ్మ (74) శనివారం పొలం పనులకు వెళ్లారు. ఉదయం నుంచి సాయంకాలం వరకూ ఎండలోనే పని చేసి ఇంటికి వచ్చారు. రాత్రికి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించారు.

మూడు జోన్లుగా తెలంగాణ

- ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


గౌరవ వందనం స్వీకరిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణను మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి చేస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ డ్రీమ్- 2050 మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నామన్నారు. తెలంగాణను మూడు జోన్లుగా విభజన చేస్తున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ ఓఆర్‌ఆర్ పరిధిలో ఉన్న ప్రాంతం అర్బన్ తెలంగాణ, ఓఆర్‌ఆర్ నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు ప్రాంతం వరకు సబ్ అర్బన్ తెలంగాణ, రీజినల్ రింగ్ రోడ్డు నుంచి తెలంగాణ సరిహద్దు వరకు గ్రామీణ తెలంగాణగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. మూడు ప్రాంతాలకూ త్వరలో అభివృద్ధి ప్రణాళికలు ప్రకటిస్తామన్నారు. త్వరితగతిన రీజినల్ రింగు రోడ్డు పూర్తి చేస్తామని తెలిపారు.

స్వేచ్ఛ తెలంగాణ జీవనశైలిలో భాగం

స్వేచ్ఛ అనేది తెలంగాణ జీవనశైలిలో భాగమని రేవంత్ అన్నారు. బానిసత్వాన్ని తెలంగాణ ప్రజలు సహించరన్నారు. సంక్షేమం ముసుగులో ప్రజాస్వామ్యాన్ని చెరబట్టాలని చూస్తే తెలంగాణ భరించదని చెప్పారు. ప్రేమను పంచడం, పెత్తనాన్ని ప్రశ్నించడం రాష్ట్ర ప్రజల తత్వమని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో పాలకులు, పాలితుల మధ్య గోడలు బద్దలు కొట్టామని వివరించారు. ఇందిరా పార్కులో ధర్నాలకు అనుమతిచ్చామన్నారు.

ప్రతిపక్షానికి గౌరవం ఇచ్చామని పేర్కొన్నారు. తెలంగాణ కలను సాకారం చేసిన కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీకి, అప్పటి లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్, సహకరించిన సుష్మాస్వరాజ్‌లకు ఈ సందర్భంగా సిఎం రేవంత్ కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర అధికార గీతం 'జయ జయహే తెలంగాణ'ను విడుదల చేశారు. తెలంగాణ చరిత్రకు అద్దంపట్టేలా, మేథావుల సూచనలకు అనుగుణంగా ప్రభుత్వ చిహ్నాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రజల ఆకాంక్షల మేరకు సగటు గ్రామీణ మహిళా రూపమే తెలంగాణ తల్లి రూపంగా ఉంటుందని అన్నారు.

సోనియా వీడియో సందేశం

తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోనియా వీడియో సందేశాన్ని అవతరణ వేడుకల్లో ప్రదర్శించారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమర వీరుల త్యాగాలను ఆమె గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటిస్తామని 2004లో కరీంనగర్ సభలో హామీ ఇచ్చిన విషయాన్ని సోనియా గుర్తు చేశారు. గడిచిన పదేళ్లుగా ప్రజలు కాంగ్రెస్ పార్టీ పట్ల అత్యంత ప్రేమ, అభిమానాలు చూపారన్నారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తామని సోనియా తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

ప్రజాశక్తి - యంత్రాంగం


భాస్కర్‌రావు (ఫైల్)


ఈశ్వర్ (ఫైల్)


శరత్ (ఫైల్)


శివ (ఫైల్)

వేర్వేరు ప్రాంతాల్లో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు యువకులు దుర్మరణం చెందారు. ఈ ఘటనలకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం విస్సన్నపేట గ్రామానికి చెందిన దోమరౌతు ఈశ్వరరావు (32), తూరిబిల్లి భాస్కరరావు (33) గ్రామ సమీపంలోని పరంటమ్మలోవకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి వస్తుండగా బైకు అదుపుతప్పి కల్వర్టులోకి దూసుకెళ్లింది. అక్కడున్న రాళ్లకు వారిరువురూ బలంగా తాకడంతో మృతి చెందారు. సిఐ వినోద్ బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విజయనగరం జిల్లా డెంకాడ మండలం చింతలవలస గ్రామానికి చెందిన దేబార్కి శరత్‌కుమార్ (26), కర్రు శివప్రసాద్ (25) పల్సర్ ద్విచక్ర వాహనంపై భీమిలి నుంచి వస్తున్నారు. శివప్రసాద్ వాహనం నడుపుతుండగా, శరత్ కుమార్ వెనుక కూర్చున్నాడు. బొడ్డవలస పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని బలంగా ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. శరత్ కుమార్ తల్లి ముత్యాలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగన్‌కు ప్రజలు సరైన తీర్పునిస్తారు

- టిడిపి అధికార ప్రతినిధి విజయ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగన్ ఐదేళ్ల పాలనలో అనేక బాధలు అనుభవించారని, ఈ అరాచక పాలనకు ప్రజలు సరైన తీర్పును ఇవ్వబోతున్నారని టిడిపి అధికార ప్రతినిధి నీలాయంపాలెం విజయ్‌కుమార్ అన్నారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ ఐదేళ్లల్లో డబ్బును తాయిలాలుగా పంచి ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తూ వచ్చారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం చిందరవందర చేసిన ఈ రాష్ట్రాన్ని మళ్లీగాడిలో పెట్టాల్సి ఉందన్నారు.

చంద్రబాబుపై తప్పుడు కేసు: రఫీ

తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుపై వైసిపి నాయకులు, హైకోర్టు న్యాయవాది చిట్టం వెంకట్‌రెడ్డి తప్పుడు కేసు పెట్టారని టిడిపి అధికార ప్రతినిధి సయ్యద్‌రఫీ అన్నారు. టిడిపి కౌంటింగ్ ఏజెంట్లను రెచ్చగొట్టేలా మాట్లాడారని, వైసిపి ఏజెంట్లను బెదిరించమని చెప్పినట్లు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేశారని తెలిపారు. చంద్రబాబు ఈ సమావేశంలో లేకపోయినా.. ఉన్నట్లుగా తప్పుడు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. వైసిపి ఏజెంట్లను రెచ్చగొట్టింది ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అని తెలిపారు. టిటిడి భక్తుల ఆరోగ్య, ప్రాణాలను పణంగా పెడుతోందని టిడిపి అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ విమర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో జగన్ అండ్‌కో అడ్డూ అదుపూ లేకుండా దోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు. భక్తులకు సరఫరా చేస్తున్న నీరు, ఆహారం పూర్తిగా అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. కనీస ఆహార భద్రతా ప్రమాణాలను పాటించడం లేదని ఆరోపించారు. అధికారులు మేల్కొని యాత్రికులకు నాణ్యమైన సౌకర్యాలు కల్పించాలనికోరారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

- 'అలుపెరగని పోరాటం' పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



సభలో మాట్లాడుతున్న వై. జయరాజు, పక్కన ఎస్.మన్సూర్ రెహామాన్, పినాకపాణి, ప్రసాద్ శర్మ తదితరులు

మతోన్మాద శక్తుల అరాచకాలను వామపక్ష ప్రజాతంత్ర, లౌకిక అభ్యుదయ వాదులందరూ అడ్డుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రబీర్ పుర్కయస్త రచించిన 'అలుపెరగని పోరాటం' పుస్తకాన్ని కర్నూలులోని లలిత కళా సమితి హాల్లో హైకోర్టు సీనియర్ న్యాయవాది వై. జయరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వై.జయరాజు మాట్లాడుతూ.. నేటి పరిస్థితుల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు అర్థం చేసుకొని ప్రజాస్వామ్య విధానాలను, గతం, వర్తమాన పరిస్థితులను సమ్మిళితం చేసుకొని రాసినదే ఈ పుస్తకం అని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ కాలం నుంచి నేటి వరకూ సమాజంలో జరిగిన సంఘటనలను ఇందులో వివరించారన్నారు. హిందూ, ముస్లింల మధ్య తగాదాలు పెట్టి వారిని రెచ్చగొట్టి ఆర్ఎస్ఎస్ రాజకీయ పబ్బం గడుపుకుంటుందని విమర్శించారు. ఎక్కడ ఏ చర్చ జరిగినా మతాన్ని గురించి చర్చిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎక్కడ, ఎవరు మాట్లాడినా వారిని అరెస్టు చేయడం, జైల్లో పెట్టడం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఆర్థిక అసమానతలు రూపుమాపిన నాడే ప్రజాస్వామ్యం మనగలుగుతుందని పేర్కొన్నారు. ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ ఎస్.మన్సూర్ రెహామాన్ మాట్లాడుతూ..కమ్యూనిజం అన్న, క్రైస్తవులు ,ముస్లింలు, దళితులు అన్నా బిజెపికి నచ్చదన్నారు. 320 మంది జర్నలిస్టులు జైల్లో మగ్గుతున్నారని, ఇద్దరు ముఖ్యమంత్రులను జైళ్లలో ఉంచిన ఘనత బిజెపికే దక్కుతుందన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విరసం నాయకులు పినాకపాణి మాట్లాడుతూ.. రాజ్యాంగం గురించి మాట్లాడే వాళ్లంటే మోడీకి రుచించదని, మంద బలాన్ని అడ్డం పెట్టుకొని ఏదైనా చేయవచ్చు అనే భావనలో ఆయన ఉన్నారని తెలిపారు. కుల వ్యవస్థపై ఆధారపడి బతికే పార్టీ బిజెపి అని విమర్శించారు. కర్నూలు సివిల్ ఫోరం అధ్యక్షులు ప్రసాద్ శర్మ మాట్లాడుతూ.. పోరాట యోధుల, నిజాయితీ గల రాజకీయ పార్టీల నాయకుల మనుగడ ప్రశ్నార్థకమైందన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించేందుకు పీడిత ప్రజలందరూ ఏకం కావాలని, ప్రజలను చైతన్యం చేస్తే విజయం సాధించవచ్చని తెలిపారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహ మాట్లాడుతూ.. ప్రబీర్ పుర్కాయస్థా జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని, తమ భావజాలాలను ప్రకటించడానికి పత్రికలు, మీడియా ముందుకెళ్లాలన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో ప్రజాశక్తి బుక్‌హౌస్ ఇన్‌ఛార్జి మధు, ప్రజాసంఘాల నాయకులు, కవులు, రచయితలు, మేధావులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

వార్షిక రుణ ప్రణాళికలో కౌలురైతుల విస్మరణ తగదు

- 32 లక్షల మందికి కార్డులివ్వాలి
- అందరికీ పంటరుణాలందించాలి
- ఎపి కౌలురైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ ఏడాది వ్యవసాయ సీజన్‌లకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన వ్యవసాయ వార్షిక రుణ ప్రణాళికలో కౌలురైతులను విస్మరించారని ఎపి కౌలురైతు సంఘం విమర్శించింది. తక్షణం రాష్ట్రంలోని 32 లక్షల మంది కౌలు రైతులకు రుణ కార్డులు మంజూరు చేసి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం అందరికీ పంట రుణాలందించాలని డిమాండ్ చేసింది. ఆదివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, సహాయ కార్యదర్శి పంచికర్ల రంగారావు మీడియాతో మాట్లాడారు. సాగులో 70 శాతం భూమిని కౌలురైతులే సాగుచేస్తున్నందున ఆ మేర వ్యవసాయ వార్షిక ప్రణాళికలో కౌలురైతులకు వాటా వుండాలని డిమాండ్ చేశారు. 32 లక్షల మంది కౌలురైతులుంటే వ్యవసాయశాఖ కేవలం పది లక్షల మందికి కార్డులు ఇవ్వాలనే లక్ష్యం పెట్టుకోవడం తగదన్నారు. గతేడాది కేవలం 7 లక్షల మందికి రుణ అర్హత కార్డులిచ్చినా అందరికీ పూర్తి స్థాయిలో రుణాలు అందించలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చే కార్డుల్లోనూ ఎక్కువగా బోగస్ కార్డులు వుంటున్నాయని తెలిపారు. అలాగే చాలా మంది కౌలురైతులకు కార్డులివ్వకుండా భూ యజమానులు, వారి బంధువులు అడ్డుపడుతున్నారని అన్నారు. గ్రామ సభలు జరిపి అర్హులైన ప్రతి కౌలురైతుకూ కార్డును ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోకి రుతుపవనాలు కూడా ప్రవేశించాయని, తక్షణం విత్తనాలను, ఎరువులను రైతులకు సిద్ధంగా వుంచాలని డిమాండ్ చేశారు. వరి విత్తనం ఓపెన్ మార్కెట్‌లో ప్యాకెట్ రూ.1,200 వుంటే, ఆర్‌బికెలలో రూ.1,100కు ఇస్తున్నారని తెలిపారు. రైతులకు ఇచ్చే సబ్సిడీ మొత్తాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే వేరుశనగ విత్తనానికి 90 శాతం సబ్సిడీ చెల్లించాలని కోరారు. గతేడాది రకరకాల కారణాలతో రాష్ట్రంలో 7.6 లక్షల ఎకరాల భూమి సాగుకు నోచుకోలేదని తెలిపారు. ఈ ఏడాది అలాంటి పరిస్థితి రాకుండా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న పంటకాల్వల మరమ్మతులను తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

'ఉక్కు' పరిరక్షణకు ఎంతటి పోరాటానికైనా సిద్ధం

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ప్రభుత్వ రంగ సంస్థ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఎంతటి పోరాటాలకైనా కార్మికులు సిద్ధంగా ఉన్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1207వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు, వైఎస్ఆర్‌టియుసి అనుబంధ కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పిట్టా రెడ్డి మాట్లాడుతూ ప్లాంట్‌ను కాపాడుకునేందుకు పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులంతా కలిసికట్టుగా ముందుకెళ్తున్నారన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి స్థాయి ఉత్పత్తిని చేయగలిగితే లాభాలు వస్తాయని, మరింత మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఆ అంశాలను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలని నిర్ణయించడం దారుణమన్నారు. భవిష్యత్తులో విశాఖ ఉక్కును రక్షించుకునేందుకు పోరాటాలు ఉధృతం కానున్నాయని తెలిపారు.

గూడ్స్ రైళ్లు ఢీ : ఇద్దరు లోకోపైలట్లకు గాయాలు

పంజాబ్ : పంజాబ్‌లో ఆదివారం ఉదయం ఎదురెదురుగా వస్తున్న రెండు గూడ్స్ రైళ్లు ఢీకొన్నాయి. దాంతో కొన్ని బోగీలు బోల్తాపడగా, మరికొన్ని బోగీలు ఒకదానిపైకి ఒకటి ఎక్కాయి. ఈ ప్రమాదంలో రెండు రైళ్లకు చెందిన లోకోపైలట్లు తీవ్రంగా గాయపడ్డారు. పంజాబ్ రాష్ట్రం సిర్‌హింద్ జిల్లా మాధోపూర్ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. గాయపడ్డ లోకోపైలట్లను ఫతేగఢ్ సాహిబ్ సివిల్స్ ఆస్పత్రికి తరలించారు.

ఇసి పోస్టల్ బ్యాలెట్ ఉత్తర్వులపై సుప్రీంలో వైసిపి పిటిషన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇసి పోస్టల్ బ్యాలెట్ ఉత్తర్వులపై సుప్రీంకోర్టును వైసిపి ఆశ్రయించింది. అధికారిక సీల్, హోదా లేకుండా స్పెసిమెన్ సిగ్నేచర్‌తో ఆమోదించాలన్న ఇసి ఉత్తర్వులను వైసిపి సవాల్ చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నియమ, నిబంధనలే కొనసాగించాలని, పోస్టల్ బ్యాలెట్‌పై హైకోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని పిటిషన్ దాఖలు చేసింది. కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే ఇటువంటి ఉత్తర్వులివ్వడాన్ని వైసిపి ప్రశ్నించింది. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫారమ్‌పై అటెస్టింగ్ అధికారి సంతకం ఉండి, పేరు, హోదా, సీల్ లేకపోయినా కూడా వాటిని ఆమోదించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వైసిపి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో అభ్యంతరాలుంటే వాటిని ప్రస్తావించేందుకు ప్రత్యామ్నాయ వేదికలున్నాయని పేర్కొంది. దీనిపై సుప్రీంకోర్టులో వైసిపి సవాల్ చేసింది.


క్యూలైన్‌లో యాత్రికులు

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమలలో యాత్రికుల రద్దీ కొనసాగుతోంది. ఉచిత దర్శనం క్యూలైన్లలో ఉదయం ఏడు గంటలకు ప్రవేశించిన యాత్రికులకు 24 గంటల సమయం పడుతోందని టిటిడి అధికారులు తెలిపారు. మూడు వందల రూపాయల ప్రత్యేక దర్శనం టికెట్లను కొనుగోలు చేసిన వారికి మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతోందన్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు యాత్రికులతో నిండిపోయాయి. శని, ఆదివారాలకు తోడు కాలేజీలకు వెళ్లే విద్యార్థులు మొక్కలు చెల్లించుకునేందుకు బారులు తీరారు. యాత్రికుల రద్దీని బట్టి అధికారులు తగు చర్యలు చేపట్టారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

శ్రీవారిని డిప్యూటీ సిఎం నారాయణస్వామి, మంత్రి రోజా, మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, నారాయణ దర్శించుకున్నారు. వైసిపి భారీ మెజారిటీతో గెలవబోతోందని నారాయణ స్వామి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రజలు సంక్షేమానికి, అభివృద్ధికి పట్టం కట్టారని, మహిళలు, వృద్ధులు రాత్రి వరకు క్యూలో నిలబడి ఓటు వేశారని రోజా అన్నారు. సిఎం జగన్‌ను ప్రజలందరూ ఆశీర్వదించారని,టిడిపి అధికారంలోకి వస్తోందని, 53 శాతం ఓట్ షేరింగ్‌తో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోందని గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎగ్జిట్ పోల్స్ అన్ని టిడిపికి అనుకూలంగా వచ్చాయని నారాయణ అన్నారు.

తెలుగు ప్రజలంతా ఒక్కటే

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రాలు రెండైనా.. తెలుగు ప్రజలంతా ఒక్కటేనని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. రెండు రాష్ట్రాలు ఏర్పడి పదేళ్లు అని ఆదివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. తెలుగు ప్రజల విజయాలు, కీర్తి ప్రపంచ వ్యాప్తం కావాలని కోరారు. పది కోట్ల తెలుగు జాతి మేటిగా వెలగాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. ప్రభుత్వ విధానాల ద్వారా సంక్షేమం, అభివృద్ధితో ప్రజల జీవితాల్లో మార్పులు మొదలయ్యాయని వివరించారు. పేదరికం లేని సమాజం దిశగా రెండు రాష్ట్రాల ప్రయాణం సాగాలని ఆకాంక్షించారు.

టిడిపి, వైసిపి కార్యాలయాల వద్ద భద్రత పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి, వైసిపి ప్రధాన కార్యాలయాల వద్ద పోలీసులు భద్రత పెంచారు. మంగళవారం ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. టిడిపి కార్యాలయం వద్దకు చేరుకుని పోలీసులు భద్రతకు సంబంధించిన చర్యలను పరిశీలించారు. పార్కింగ్, ఇతర ప్రదేశాలను పరిశీలించారు. అదే విధంగా వైసిపి కార్యాలయానికి పోలీసులు చేరుకుని పరిశీలించారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసం వద్ద, ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం వద్ద కూడా పోలీసులు భద్రత పెంచారు.

సిఎంపై రాయిదాడి కేసులో నిందితుడికి బెయిల్

ప్రజాశక్తి-నెల్లూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రాయిదాడి కేసులో నిందితుడు వేముల సతీష్ బెయిల్‌పై ఆదివారం విడుదలయ్యారు. కోర్టు ఆదేశాల మేరకు సతీష్‌కు రెగ్యులర్ బెయిల్ వచ్చిన విషయాన్ని ఆయన తరపున న్యాయవాదులు జైలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి అందుకు సంబంధించిన పత్రాలను నెల్లూరు సెంట్రల్ జైలు అధికారులకు అందజేశారు. అధికారులు పరిశీలించి సతీష్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వేముల సతీష్ న్యాయవాది సలీమ్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 14న వేముల సతీష్ తన జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న సమయంలో పోలీసులు అక్కడికి వచ్చి సిఎంపై దాడి జరిగిందని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పడంతో వారు ఇంటికి వెళ్లారని తెలిపారు. రెండు రోజుల తరువాత వేముల సతీష్ ఇంటికి పోలీసులు వచ్చి, సిఎంపై దాడి చేసింది నువ్వేనని, అంగీకరించాలని బెదిరించారన్నారు. ఒప్పుకోకపోవడంతో పోలీసులు అన్యాయంగా తన క్లైయింట్‌ను అరెస్టు చేశారని ఆరోపించారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే వైసిపి నేతలు ఇటువంటి డ్రామాకు తెరలేపారని విమర్శించారు.



"న్యాయం గెలుస్తుంది అన్న మాట
నిజమే కానీ, గెలిచేదంతా న్యాయం
కాదు."
– శ్రీశ్రీ

రేపటి కోసం ...

నీడను నిట్టనిలువున చీల్చి
చొక్కా పట్టుకుంటావు
నిలదీసి నిప్పుల్ని కక్కిస్తావు
గతించిన వాస్తవాలకి ముకుతాడు వేసి
వర్తమానంలోకి లాక్కొస్తావా
కాలిన పిడికెడు బూడిద
నీ హస్తంలో రహస్యాల్ని ఆవిష్కరిస్తుంది
అనాచ్ఛాదిత నిస్సహాయ కేకలు
శిథిల చరిత్రలు పేజీలు తిప్పుతాయి
గురిగింజల గుండెల్లో
బాంబుల డంపులు పేలుస్తూ
గుమ్మడి కాయల్లేవన్న నిజాన్ని
నిర్భయంగా చాటే ఎజెండా మార్కు జెండావి
నీ వునికే వో లై డిటెక్టర్
నీ పేరొక రాజకీయ ప్రకంపన
హవాలా డైరీల్ని బహిర్గతం చేసినప్పుడు
పార్లమెంటు గోడలపై
నల్లరంగు పడకుండా అడ్డుకున్నప్పుడు
ప్రశ్న కోసం పైసలడిగే
పార్లమెంటేరియన్లు కాలర్ పట్టి
'కాలమ్'లోకి లాగినప్పుడు
నీ గొంతులో పద ప్రభంజనం
అక్షరాల్లో విప్లవ తాండవం
ఏ కలాల కల్లుపైన సానపట్టిస్తావో
నీ వాక్యాల నిండా అగ్నికాంతులే
గోద్రా రైలు నడిచిన కుట్ర పట్టాలపైన
అమాయక ప్రాణాల్ని దహనం చేయడానికి
తెరవెనుక ప్రదర్శించుకొన్న కపట నాటకం
భజన రంగుల అనేక ముఖాలు
సమస్త హిందూ జాతి సిగ్గుపడ్డ క్షణాలు
అమ్మనీ, అమ్మ కడుపులోంచి పిండాన్నీ
బైటికి లాగి చంపిన బండారం
సజీవ స్వప్న నరమేధం
కన్నె పిల్లల కామదహనం
మతం పేరిట మహోక్ష మారణకాండ
నీ నిబద్ధతే తేటతెల్లం చేసింది
కదిలే గుండెని కదిలే నదిని చేసింది
నీపైన రంగుల బురద చల్లుతున్న వాళ్లని
నీ సత్యార్థ ప్రకాశికలో ..
చీకట్లు కుమ్మరిస్తున్న వాళ్లని
నైతిక నిఘంటువు నుంచి బహిష్కరించాలి
చైతన్య ధారా ప్రవాహం నుంచి వెలివేయాలి
ఇప్పుడొక అమలిన వ్యవస్థకి
గుండె గోడల పైన పునాది గీతం చెక్కాలి
నేటినుంచైనా ...

– ఈతకోట సుబ్బారావు
94405 29785

గాయపడిన గుండెలు

చరిత్రలో శిల్పం చెక్కిన శిల్పి ఒకరుంటారు
దాన్ని విరగ్గొట్టిన తీవ్రవాది ఒకరుంటారు
స్వాతంత్ర్యం తెచ్చినవారొకరుంటే
స్వేచ్ఛను శాసించేవారొకరుంటారు
అనర్హులు అందలమెక్కితే
అంచనాలు పూట గడవడం దగ్గరే ఆగిపోతాయి!

ప్రజలు ముళ్ళు తక్కువున్న చేప కావాలనుకున్నారు
కాని కండలేని చేప దక్కింది
యువత భవిష్యత్ కలలుగన్నారు
కలలు మౌనంగా విరిగిపోయాయి
అనిశ్చితి మీద నిలబడి
పుట్పాత్ మీద పడుకుని
శూన్యంలోకి చూస్తున్నారు

అనర్హుల స్వేచ్ఛకు మన రెక్కలిచ్చాము
వారి దాహార్తికి దారుణమైన ధరలు చెల్లిస్తున్నాము
సాధారణ ప్రజల విధేయతను గాయపరిచారు
బహుశా గాయం మనం అనుకున్నదానికంటే లోతైనది
మనం అనుకున్నదానికంటే కుట్రపూరితమైనది
అందులో మీ ఊరూ వుండొచ్చు
నీవూ వుండొచ్చు

వాళ్ళ వాక్చాతుర్యంతో
మనం మళ్ళీ మోసపోయినపుడు
మళ్ళీ వేదికపై మోసగాళ్ళను చూసినపుడు
మన అజ్ఞానంతో మనం ఓడిపోతాం
మనం ప్రజాస్వామ్యంలో నివసిస్తున్నాము
కాని ఎప్పుడో ఒకటి ఎన్నికల్లాంటి
మనం బతికున్నామని గుర్తుచేసే సంఘటనలు తప్ప
నాయకుల్ని ఎప్పటికీ కలుసుకోలేకపోయాము
ఏమీ చెప్పుకోలేకపోయాము
గాయపడిన గుండెల్తో
బతుకు బుగ్గిమీది చివరి పొగల్తో
రేపటి గురించిన కుతూహలం లేదు మనలో

జీవితాలను, భవిష్యత్తును ఉచితాలతో గణించలేము
వేర్లు నానని వానలాంటి సంక్షేమాలను
బతుకుల్ని గుప్పెడు గింజలకో
పదిరూపాయల తాయిలానికో
దిగజార్చేవాళ్ళను సహించలేము
వారితో ప్రయాణం చీకటిలోకి దారితీస్తుంది!

– శాంతయోగి యోగానంద
91107 70545

సొంత నేలపై శరణార్థి

యుద్ధాలు వద్దంటూ నినదించండి
మానవ హననాన్ని ఎదిరించగ రండి
ప్రపంచ నేతలంతా శాంతిని నిలపండీ
పాలస్తీనా ప్రాణాలను కాపాడండీ! .. **యుద్ధాలు ...**

అమెరికా కనుసన్నల్లో జరుగుతోంది యుద్ధం
ఐక్యరాజ్య సమితి చేష్టలుడిగి చూసే కుతంత్రం
యాసర్ అరాఫత్ మరణం మర్మంగా మిగిలింది
పాలస్తీనా.. ప్రపంచ పటం నుండి తొలగనుంది!

వలసొచ్చిన జర్మన్ యూదులు ఇజ్రాయిలను
హిట్లర్ ఊచకోత నుంచి పాలస్తీనా ఆదుకుంది
శరణు శరణు పాలస్తీనా శరణననియన్న ఇజ్రాయిల్
పాలస్తీనానే యూదులు పాతరేయ చూస్తున్నరు!

మాతృదేశంలోనే శరణార్థి పాలస్తీనా
సొంత దేశంలోనే పరాయిగా మారెనా?
పుట్టెను పెనుకేక ఆక్రోశపు ప్రతిఘటనా
పాలస్తీనాకు మనం మద్దతుగా నిలుద్దాం!

మతదాహం మత మోహం కాలి కూలి పోవాలి
సమవాదం నవనాదం ప్రతి దేశంలో పలకాలి
తరతరాల మతోన్మాద క్రీడను ఉరితీయాలి
నరనరాన అగ్నిధార ఉప్పెన ఉప్పొంగాలి
మతంలేని ప్రపంచాన్ని మనిషి గెలుచుకోవాలి – 2

– సాంబరాజు యాదగిరి
93460 18141

మధుర కవి నూతక్కి అబ్రహాం

సందర్భం

"ఎవరీ మధుర గంభీర కవి? తన అంతర్వేదనావర్తం నుంచి పొడమిన బుడగలను పద్య ముత్యాలుగా మార్చగల మహాకవి ఎవరు? పేదరికంలో, వర్ణాచారపుటూబిలో పడి గిలగిలకొట్టుకుంటూ, ఊపిరాడక, చేయూతనిచ్చే దిక్కులేక, పడ్డ తపనంతా కవిత్వంగా జాలువార్చగల మహా కవితాశక్తి సంపన్నుడెవరు?' అని ఒక కవి కావ్యాన్ని చదివి ఆశ్చర్య చకితుడయ్యాడు సుప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు. శ్రీకృష్ణ దేవరాయలు రచించిన ఆముక్త మాల్యద వంటి ప్రౌఢ సుందర మహాప్రబంధ సంవిధాన రచనాలోలుడైన తుమ్మపూడి వారి మనసు దోచుకున్న ఆ మహాకవి నూతక్కి అబ్రహాం. ఆయన మతోన్మాద పెనుభూతాల దండును, జాత్యహంకార వికార చర్యలను దునుమాడి, అంటరాని నిరుపేదల ఆక్రోశాలను ఆర్ద్రంగా కవిత్వీకరించిన కవి. అబ్రహాం కవిత్వం ఏడు దశాబ్దాల తరువాత కూడా నేటికీ వాడిగా, వేడిగా జ్వలిస్తుంది. మహాకవి జాషువా ప్రియశిష్యుడిగా పేరుగాంచిన అబ్రహాం గుంటూరు జిల్లా తెనాలి తాలూకా కొలకలూరులో డానియేలు, కాటమ్మ దంపతులకు 1923 మార్చి 7వ తేదీన జన్మించాడు. పోలీసు ఉద్యోగం చేస్తున్న తండ్రి వినుకొండకు బదిలీ కావడంతో అబ్రహాం బాల్యం అక్కడే చిగురించింది. వినుకొండలో 9వ తరగతి వరకు చదువుకొని, దుగ్గిరాలలో యస్‌యస్‌యల్‌సి విద్యనభ్యసించి, గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో ఎఫ్‌ఎ పూర్తి చేశాడు. అనంతరం తనకిష్టమైన ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించి, తెలుగు పండితునిగా నాలుగు దశాబ్దాలపాటు ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దాడు. విద్యాసేవలో తరిస్తూనే, సాహిత్యసేవలోనూ నిమగ్నమై 'మధుర కవి'గా మన్నలందుకున్నాడు.

గుర్రం జాషువా, గద్దెల జోసెఫ్, బీర్నీడి కవులతో అలరారుతున్న వినుకొండ సాహిత్య వాతావరణం అబ్రహాంలో సృజనోత్తేజాన్ని



జూన్ 5
నూతక్కి అబ్రహాం వర్ధంతి

కలిగించింది. రాజకీయ, సాంస్కృతిక చైతన్యానికి పెట్టిన పేరైన తెనాలి ప్రాంతం ఆయనకు కొత్త పాఠాలు నేర్పింది. జాషువా స్ఫూర్తితో బాల్యంలోనే అబ్రహాం పద్యరచన వైపు దృష్టి సారించాడు. పంచ కావ్యాలు పఠించి తెలుగు భాషాసాహిత్యాలపై పట్టు సాధించాడు. అడుగడుగునా అవమానాలను, మత వివక్షను ఎదుర్కొంటూనే, అక్షరాన్ని నమ్ముకొని సృజన శూరుడై ముందుకు నడిచాడు. ఏబయ్యేడేళ్ల పాటు తెలుగు భాషకు సేవ చేసిన అబ్రహాం 1999 జూన్ 5వ తేదీన సెలవంటూ వెళ్లిపోయాడు.

జాతీయోద్యమం, ఆది ఆంధ్ర ఉద్యమం, హరిజనోద్యమం, వామపక్ష పోరాటాల వెలుగుల్లో ముప్పయ్యో దశకం ఒక కొత్త చైతన్యాన్ని ఆనాటి కవులకు అందించింది. ఈ రకమైన బహుముఖీన చైతన్యంతో, తన అస్తిత్వ చైతన్యం నేర్పిన ఎరుకతో అబ్రహాం తన కర్తృత్వంతో తెలుగు పద్య కవిత్వానికి ఖ్యాతి చేకూర్చాడు. మత్కుణం, జల రుహాక్షి, పావురము, పరిపూర్ణుడు లాంటి కావ్యాలను, పాప క్షమ నాటికను, అభాగ్య జీవి నవలను రచించాడు. ఇందులో మత్కుణం (1951) గొప్ప కావ్యం. రోజంతా కష్టపడి ఇంటికి చేరుకొని, కాస్త గంజి తాగి కుక్కిమంచంలో నిద్రపోతున్న అంటరాని నిరుపేదను మత్కుణం (అంటే నల్లి) కుట్టింది. తనను బాధించి నిద్రను భంగపరిచిన నల్లిని చంపకుండా, తన గుండెలో అగ్నిగుండాలై పొగలు గక్కే దుర్భర వేదనను, లోకం పోకడలను ఆ నిరుపేద మత్కుణంతో ఏకరువు పెట్టాడు. ఆ నల్లికి అసమ సమాజ దౌష్ట్యాన్ని, శ్రమైక జీవన ప్రాభవాన్ని ప్రబోధిస్తాడు కవి. పూర్తిగా జాషువా గబ్బిలం శైలిలో సాగిన కావ్యమిది. కావ్య కథానాయకుడైన నిరుపేద ఔన్నత్యాన్ని, త్యాగనిరతిని, అతని అసాధారణ వ్యక్తిత్వాన్ని కావ్యారంభంలో సమున్నతంగా కవి పరిచయం చేస్తాడు.

"వాడు జగాలు బ్రోచెడు ప్రభావిభవాఢ్యుడు, వాని రెక్కలీ/ నాడు శ్రమింపకున్న నరనాథుల నాథలు కారే, భూమిపై/ బూడిద రేగదే? కుడువ బొక్కెడు బువ్వకు విశ్వమాత పొ/ ర్లాడి కృశింపదే? కరువు నందు వసించదే దిక్కులేనిదై" అంటూ కష్టజీవి విశిష్టతను, అతని శ్రమవిలువను, ఆ విలువ కరువైతే సంభవించే విషమ పరిస్థితులను వివరించాడు. అంటరాని నిరుపేదను జగాలను బ్రోచెడు విభవాఢ్యుడిగా సంభావించటం అద్భుతం. "ధనికులిండ్లయందు శునకమ్మునకు గల్గు/ గౌరవమ్ము లోన గంటె డేని/ దక్కదయ్య నాకు దాసత్వమే దక్క" అంటూ మనువాద సమాజ దుర్నీతిని నల్లికి తెలియజేశాడు. అమాయక పేదల 'కొంపలార్పే' ధనాఢ్యుల వైఖరి, యుద్ధోన్మాదం, శాంతి ఆవశ్యకత, అమెరికా యుద్ధ కాంక్ష, అవినీతి, కుహనా సంస్కర్తల కపటత్వం, దొంగ దేశభక్తుల కుయుక్తులు, శాసనాల అమలులో పాలక వర్గాల వైఫల్యం, గంజాయి బాబాల విలాసాలు, వడ్డీ వ్యాపారుల మోసం, కుటుంబ నియంత్రణ తదితర అంశాలను, తదనుగుణమైన కష్ట నష్టాలను మత్కుణం కావ్యంలో వ్యంగ్య భావ విలసితంగా అబ్రహాం చిత్రించాడు. నల్లి ఎవరికి దూరంగా ఉండాలో, రుచికరమైన రక్తాన్నం కోసం ఎవరిని ఆశ్రయించాలో కథానాయకుడి ద్వారా ప్రబోధించాడు. కష్టజీవినైన నా నెత్తురు నీకు 'తీపి నైవేద్యం' కాదని హెచ్చరించాడు. పూరి గుడిసెల వైపు, కుక్కి మంచంలో కూర్చున్న అంటరాని జనుల ఆకలి డొక్కల వైపు అసలు వెళ్లవద్దని నల్లికి ప్రేమగా విన్నవించాడు. నిరుపేదల చిక్కని నెత్తురంతా దొరల సేవలోనే ఖర్చయి పోయిందని, అందుకే కారులో షికారు చేసే ఖరీదైన దొరల, తిన్న దరగక దూది పరుపుల మీద దొర్లుతున్న ధనవంతుల 'క్రొవ్వేడి నెత్తురు'లను కడుపార గ్రోలమని సూచించాడు. "మనుజ జాతిలోన మత ఈర్ష్యలను రేపి/ కులములనెడి కొన్ని గూళ్ళు కట్టి/ యుక్తి తోడ బ్రతికి ఉదరముల్ పెంచెడి/ వారి నెత్తురలను వదలకమ్మ" అని నల్లికి నచ్చజెప్పాడు.

తన కాలంలో బుసలు కొడుతున్న తిరోగమన కవితా ప్రమాదాన్ని కూడా అబ్రహాం సాహసోపేతంగా బట్ట బయలు చేశాడు. మత భేదములను పెంచు నీచమైన రచనలను, నిలువెల్ల విషముతో నిండియున్నా, అమృతమిదియే కొనుడనెడి కవితలను, నట్టింట విషజ్వాలలు రేపే కృతులను, అంటరాని పూరి గుడిసెలపై గుట్టు చప్పుడు కాకుండా దాడులు చేసే రచనలను కూల్చి వేయాలని హెచ్చరించాడు. చందాల పేరుతో ఒక స్వామి ఉన్న సర్వస్వాన్ని ఊడ్చుతున్నాడని, చెరువంత కడుపుతో పానకమ్ము త్రాగ ఒక స్వామి పరుగెత్తుతున్నాడని కవి ఆరోపించాడు. పరమ భక్త్యోన్మాదాన్ని, దేవుడి పేరుతో జరుగుతున్న దోపిడిని కవి తీవ్రంగా విమర్శించాడు. 'ఎదుటి వాని బాధ నెదలోన తల పోసి సాయపడెడి వాని జాలి గుండె' (పరిపూర్ణుడు) లోనే దేవుని కోవెల ఉన్నదని మహనీయ తత్వాన్ని ప్రబోధించాడు. ఉదాత్త మానవుడి ఉత్తమ నైజాన్ని పరిపూర్ణుడు ఖండకావ్యంలో అద్భుతంగా ఆవిష్కరించాడు. గౌతమ బుద్ధుడు, ఏసుక్రీస్తు, స్వామి వివేకానంద, మహాత్మా గాంధీ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ తదితర మహనీయుల ఆదర్శాలను ఈ కావ్యంలో అబ్రహాం సరళ సుందరంగా పద్యీకరించాడు. వేమన, జాషువా, త్రిపురనేని, మోదుకూరి జాన్సన్ వంటి కవుల కర్తృత్వ గరిమను సమున్నతంగా తన రచనల్లో కొనియాడాడు. "ఎంత విప్లవాగ్ని ఎంతటి బడబాగ్ని/ ఎంత సింహగర్జనెంత చురుకు/ ఎంత నూత్న తత్వమెంత భావావేశమెంత/ సరస లీల, ఎంత ఠీవి, జాన్సన్ బుధ వంద్యుడు జాతికి తొలిసంధ్య" అంటూ అగ్నికవి మోదుకూరి జాన్సన్ సాహిత్య వ్యక్తిత్వాన్ని అపురూపంగా కీర్తించాడు. 'దళితులెల్ల రొక్క త్రాటిపై నడచిన/ హరిహరాదు నేని ఆపగలరు?/ మహిని దళితులొక్క మాటపై నిలిచిన/ కువలయమ్ము గుండె గుదులు కొనదె?' అన్న అంబేడ్కర్ బాటలో జాగు చేయకుండా దళితులు ఐక్యంగా ధర్మ పోరాటం చేయాలని ఈ కవి పిలుపునిచ్చాడు. 'వలపు ప్రేమ సాక్షి జల రుహాక్షి', 'అలరు నీలవేణి నాలువ రాణి' లాంటి మకుటాలతో అబ్రహాం రాసిన 'జల రుహాక్షి' ఖండకావ్యం శతక శైలిలో సాగుతుంది. ఆయన కవితా వస్తురూపాల్లో తన గురువైన జాషువా ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.

అణగారిన కవులు సాహిత్యంలోకి ప్రవేశించిన తరువాతే తెలుగు భాష సంపద్వంతమైంది. ప్రజల భాషకు ఈ కవులు పట్టాభిషేకం చేశారు. పలుకుబడుల భాషకు పెద్దపీట వేసి పద్య కవిత్వాన్ని కొంతవరకు ప్రజలకు చేరువ చేశారు. నూతక్కి అబ్రహాం కూడా ప్రజా వ్యవహారానికి సమీపంగా పద్యరచన గావించాడు. తెలుగు పద్యానికి కొత్త సొబగులు అద్దాడు. అన్య దేశీయాలను అద్భుతంగా ప్రయోగించాడు. 'సిరుల దొరసాని', 'లేములమ్మ', తమ్మిదొర, పులుగు రేడు, పిట్ట మగండు లాంటి వినూత్న ప్రయోగాలతో తెలుగు పద్య పాదాలకు రసభరితమైన పద లేపనం రాశాడు. ప్రగతిశీలమైన, దళిత చైతన్యభరితమైన భావధారతో పాఠక విధేయంగా ప్రభాశీలమైన కవిత్వం రాసిన నూతక్కి అబ్రహాం గురించి ఆధునిక తెలుగు సాహిత్యంలో మరింత విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరముంది.

– డాక్టర్ కోయి కోటేశ్వరరావు
94404 80274

ఉద్దానం మట్టి మీద

పులో సిందవో దుమ్మలగొండో
ఎలుగో జాకరో
యేటో కానుకోనేకపోతన్నం నాయినా
మేక మెడని కొరికేసి రత్తం జల్లీసింది
మా బతుక్కి యిదేమి గాచ్చారమో యేటో
ఏటేటా యిదేతంతు నాయినా ...

కాపుగాద్దుమంతె మాకంత సత్తువనేదు
వొగిలీ.. కట్టాలు సెప్పుకుంతె తీరుతాయా
ఆరుతాయా
ఇన్నోలికి సెప్పునోలు లోకువ అంతారు
మామూ నేవాటి మేకపిల్లల్లాటోలిమే అయ్యా
నోరులేనోలిమి ...

మా మీద పడి మా పేనాలు తోడేత్తున్న
జంతువ
కిడ్నీపిక్కల జబ్బు
తాతల ముత్తాల కాసి తలొగ్గేసి బలిమిని
దానికి బలైపోతున్నోలిమి
జంతువ జాడైతె తెలుత్తాది గాని దీని జాడ
మాతరం తెల్దు నాయినా !

ఉడుంపట్టు నాయినా పట్టుకుంతె వొగల్దు
అది తరాలగ మా నడుంకి సుట్టుకుని
వొగలని
కొండసిలవ

అది నాయినా దాని ఏలుబడి దాని పెద్దరకం
పొగరుబోత్తనం
ఏదో ఇలగ ఆక్కు అందక పోక్కు సెందక
బతికిత్తన్నం
వున్నికాడికి తిని లేనికాడికి పస్తులుండి
నెట్టుకొత్తున్నం

వొక్కోపాలి ఆకలితొ నకనకలాడుతున్న
పిల్లాపిచ్చికని సూడనేక దేశం దాటిత్తిన్నం
నాయినా

సెప్పేము గద నాయినా.. దానిది
ఉడుంపట్టని
ఏడు సంద్రాలు దాటెల్లిన వొగల్దు
పండుగునేదు పబ్బంనేదు పున్నమి నేదు
వొప్పుడెలిపొచ్చీసి మీదన పడిపోద్దో తెల్దు
నాయినా ...
తల్లి అని పిల్ల అని ముసిలిముడగని
ఏ కొసా కనికారం నేదు
పేదరోద అయినోలుకానోలు యెవులేన
దాని నోటికి సిక్కితె మరి ఆసిలు
వొగిలీవలిసిందె
నాయినా ...



మాయదారి కిడ్నీపిక్కల జబ్బుకి పచ్చగుండిన
ఉద్దానం అద్దోనమైపోనాది
అద్దోనమైన వుద్దానంకి రచ్చ రాజ్జిం అని
కొన్నాలు నమ్మినోలిమే నాయినా
రాజ్జిం గూడ జాడలేని జంతువె అని
గేనమయ్యేక అస్సిరె నమ్మిక పోదా
ఉద్దానంల పుట్టినోడికి వుద్దం యేపాటి
అని నానుడి

సూత్తన్నం నాయినా సూత్తన్నం
సివరాకరకి మామే వుద్దంలొ దిగిపోతం
ఉద్దానం మటీల వుద్దం సేసినోడికి
సావు నేదు!

– బాలసుధాకర్
96764 93680

మండే గుండెకు ముడిసరుకు

నా అక్షరాలు కొన్ని దారి తప్పాయి
ఎక్కడో పుస్తకాల్లో ఉండాల్సిందిపోయి
బడుగు బలహీనులకై బాసటగా పోయాయి
నా అక్షరాలు కొన్ని
తడి ఆరిన బతుకుల్లో, పొడి బారిన గొంతుల్లో
జీవగంగకై భగీరథ ప్రయత్నం చేస్తున్నాయి
నా అక్షరాలు కొన్ని ...
అచేతనమైన వ్యవస్థలో
గాఢనిద్రలో ఉన్న జనాల్ని మేల్కొల్పపోయాయి
నా అక్షరాలు కొన్ని ...
తరతరాల బానిస బతుకుల
ఉక్కు సంకెళ్ళు తెంచేందుకు పోయాయి
నా అక్షరాలు కొన్ని
తాడిత పీడిత హక్కులకై
రణనినాదమై గర్జించను పోయాయి

తప్పిన అక్షరాలన్నీ
హక్కుల సాధనలో పోరుకు వత్తాసుకు పోగా
మిగిలిన కొన్ని మండే గుండెల కార్ఖానాకు
ముడిసరుకై రగులుతున్నాయి!

– వినోద్ కుత్తుం
96343 14502

కవితా సంపుటాలకు ఆహ్వానం

ప్రతిష్టాత్మకమైన విమలా స్మారక విమలాశాంతి సాహిత్య పురస్కారం–2024 కోసం జాతీయ స్థాయిలో కవుల నుంచి 2022, 2023 సంవత్సరాల్లో ప్రచురితమైన వచన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. శతకాలు, నానీలు, పద్యకావ్యాలు పోటీకి స్వీకరించబడవు. కవులు, తమ కవితా సంపుటాలు నాలుగేసి కాపీలను 15.7.2024వ తేదీ లోపు "ఉప్పరపాటి వెంకటేశులు, 16–37–1, రాహుల్ నివాస్, ప్రశాంతినగర్, అనంతపురం–515004" చిరునామాకు పంపాలి.

– శాంతి నారాయణ

బాలనాగయ్య స్మారక కవితా సంపుటాల ఎంపిక

బాల నాగయ్య స్మారక పురస్కారానికి కవితా సంపుటాల ఎంపిక పూర్తయింది. ప్రథమ బహుమతి: రూ. 2500 శిలావృక్షం–యాములపల్లి నర్సిరెడ్డి–అనంతపురం; ద్వితీయ బహుమతి: రూ. 1500, అమ్మకు చెప్పులజత కొనాలి– లేదాళ్ళ రాజేశ్వరరావు–లక్సెట్టి పేట; తృతీయ బహుమతి: 1000, మళ్ళీ మనిషిలోకి–డా॥ఉదారి నారాయణ– ఆదిలాబాద్ లకు ఇవ్వడం జరిగింది. బహుమతి ప్రదానోత్సవం జూన్‌లో నిర్వహించే సాహితీకిరణం 15వ వార్షికోత్సవ వేడుకలలో జరుపబడుతుంది.

జాతీయ స్థాయి కథలు, కవితల పోటీ - 2024

వురిమళ్ల ఫౌండేషన్ 6వ వార్షికోత్సవం సందర్భంగా 2024 సంవత్సరానికి గాను "వురిమళ్ల ఫౌండేషన్ – అక్షరాల తోవ" సంయుక్త నిర్వహణలో జాతీయ స్థాయి కథలు, కవితల పోటీలు నిర్వహించనున్నారు. వురిమళ్ల శ్రీరాములు స్మారక కథల పోటీలో ప్రథమ బహుమతి రూ.5000, ద్వితీయ బహుమతి రూ.4000, తృతీయ బహుమతి రూ.3000 లతో పాటు రెండు కన్సోలేషన్ బహుమతులు 1000 చొప్పున ఉంటాయి. వురిమళ్ల పద్మజ స్మారక కవితల పోటీలో ప్రథమ బహుమతి రూ.4000, ద్వితీయ బహుమతి రూ.3000, తృతీయ బహుమతి రూ.2000; రెండు కన్సోలేషన్ బహుమతులు రూ.1000 చొప్పున ఉంటాయి. వీటితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న వారిలో ఒకరికి భోగోజు పురుషోత్తం – సముద్రమ్మ గార్ల సాహితీ పురస్కారంతో పాటు రూ. 10 వేల నగదు బహుమతి అందజేయబడుతుంది. కథలు, కవితలు పంపటానికి చివరి తేదీ : 30 జూన్ 2024. పంపాల్సిన చిరునామా : రాచమళ్ళ ఉపేందర్, స్టార్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, శాంతిలాడ్జి ఎదురుగా, స్టేషన్‌రోడ్, ఖమ్మం – 507 001. సెల్: 98492 77968

– వురిమళ్ల సునంద

అన్నదాతకు అండగా ...

రంగస్థలం

'రైతే రాజు' అన్న మాట మన దేశంలో ఒక నినాదంగా మిటిలిపోయింది తప్ప విధానంగా స్థిరపడలేదు. అందుకనే దేశానికి అన్నం పండించే రైతు అప్పుల్లో కూరుకుపోయి, ఆత్మహత్యకు పాల్పడుతున్నాడన్న వార్తలను నిత్యం వినాల్సి వస్తోంది. అన్నదాత ఆత్మహత్య వార్త చదివి, వినీ, అయ్యో అని మనసులో అనుకొని, మళ్లీ మనం మన మన పనుల్లో కూరుకుపోతున్నాం. ఆ స్తబ్ధతను బద్దలు చేసే ప్రయత్నంగా సీనియర్ నాటక రచయిత కంచర్ల సూర్యప్రకాష్ చేసిన ప్రయోగం 'రైతే రాజు' నాటిక. ఇటీవల అనేక పరిషత్తుల్లో ప్రదర్శింపబడుతూ బహుమతులు అందుకొంటూ ప్రేక్షకులను ఆలోచింపచేస్తున్న నాటిక ఇది. కళాంజలి హైదరాబాద్ సమాజం వారిచే కొల్లా రాధాకృష్ణ దర్శకత్వంలో, ప్రదర్శింపబడుతున్న ప్రతిచోటా ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది.

నిజం, అబద్ధం అనే రెండు పాత్రలు సవాలు ప్రతి సవాలు చేసుకోవడంలో నాటిక ప్రారంభం అవుతుంది. అబద్ధం పాత్రధారి "నిజం ఒక్కటే శాశ్వతం. సత్యమే నిత్యం. రైతే నిజం. రైతు లేకపోతే జీవకోటి లేదు, అందరినీ పోషించే ఓ దేవుడా! నీ పాదాలకు వందనం" అని చెప్పడంతో నాటిక ముగుస్తుంది. "రైతు జీవం. రైతు ప్రాణం. తల్లి తండ్రి దేవుడు. రైతే రాజు" అన్న రచయిత మాటలకు చప్పట్లు కొట్టి బయటపడడంతో రైతుల బతుకుల్లో మార్పు రాదు కానీ, చింతనాపరులను ఆలోచింపజేస్తోంది. పాలకులు రైతు పక్షపాతం కలిగినవారా కాదా? వారు రైతుకు నిజంగా సేవలందిస్తున్నారా? అన్న ప్రశ్నలతో పరీక్షించేలా చేస్తుంది.

ప్రజల నుంచి పాలకుల దాకా ప్రేక్షకుల్లా ఉండిపోతే, రైతు నిలువు దోపిడీకి, ఆత్మహత్యలకు గురవుతూనే ఉంటాడు. ఏం చేస్తే రైతు సమస్యలకు పరిష్కారం దొరుకుతుందో అందరం ఆలోచించాల్సి ఉంది. పాలకుల పన్నాగాలకు ఓటు అనే పిడికత్తి సరైన పరిష్కారం చెప్పగలదన్న బోధ ఈ నాటికలో ఉంది. నాటిక మధ్య మధ్యలో శ్రీశ్రీ కవితా పంక్తులు జనచైతన్య గీతాల చరణాలు ప్రేక్షకుల్ని ఉత్తేజపరుస్తూ, ఉద్వేగానికి గురిచేస్తాయి. పంట పండిందా? ఎండిందా? అన్న దానితో సంబంధం లేకుండా మళ్లీ సాగు కోసం, పెట్టుబడి కోసం భార్య మెడలో మంగళసూత్రం, కాళ్ళ



వెండి కడియాలు తాకట్టులోకి, ఆపై వడ్డీ పెరిగి పెరిగి అమ్ముకోక తప్పని పరిస్థితి ఈ నాటికలోని రైతు జీవితంలో చూస్తాం. ఆ సొమ్ము కూడా గొప్పింటి వాడికి పండుగ జరుపుతుందే కానీ పండించిన వారికి తిండి గింజలు మిగలని స్థితి. ఇదే రైతు భారతం, బాగోతం.

విదేశీ నల్లధనం తెచ్చి రైతు ఖాతాల్లో జమ చేస్తాం అన్నవారు దాని అమలు చేయకపోతే.. క్వార్టర్ మందుకి, బిర్యాని పొట్లానికి, నోటుకు ఓటును అమ్ముకున్నోళ్ళంగా నిగ్గదీసి నిలదీసి సిగ్గుపడేలా చేయలేకపోతున్నాం. ఖద్దరు ఖాకీ కాషాయం– ఈ మూడింటి అనైతిక కలయిక ఒకటి, ప్రజల్ని మతం మత్తులో ఉంచి, ఆ ఖాకీరక్షణ ఖద్దరుకు లభిస్తుంటే, జెండాలు వేరైనా అజెండా ఒకటైనవాళ్లు ప్రజల్ని ఆలోచించకుండా చేస్తున్నారు. ఒక నిమ్మకాయతో కొబ్బరికాయతో, మూఢనమ్మకాల ఆసరాతో జనాన్ని మతానికి బానిసలుగా చేసి, పీఠాల ఏర్పాటు పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపార ముసుగుతో జనాన్ని మోసగించటం కొనసాగుతూనే ఉంది. ఖాకీ ఖద్దరూ రెండూ తరచూ తమ తమ మద్దతును పరోక్షంగా తెలియజేస్తూ.. మొత్తం తామే తినకుండా కొద్దికొద్దిగా ఇతరులకు పడేసి జనచైతన్యాగ్నిపై నీళ్లు చల్లుతుంటారు. ఇది గ్రహించి నిద్ర లేపుతున్న కోళ్ల మెడ కోసి కూరొండుకు తింటారు ఈ దుష్ట త్రయం. అయినా, ఎప్పుడు జనం నిద్రలేచి తమ పీకలకు ఉరిబిగిస్తారో అన్న భయం వారిని లీలగా వెంటాడుతూనే ఉంటుంది.

ఈ దశలో సత్యం పాత్రధారి ప్రవేశించి, రైతు తనకు కావలసినంత పంట మాత్రమే పండించుకుని అప్రకటిత క్రాప్ హాలిడేని పాటించమంటాడు. చచ్చిపోతాం అని తలవంచుకు జీవించడం కాదు.. ఎలా బతుకుదాం? అని ఆలోచించమంటాడు. సముద్రమంత సమస్య ఉన్నా, ఆకాశమంత అవకాశం ఉండి తీరుతుందని ఉద్బోధిస్తాడు. పంట ధరను రైతులే నిర్ణయించుకోగలిగిన నాడు రైతుకు మంచి రోజులు వచ్చి, 'రైతే రాజు' అన్న నినాదం నిజమవుతుంది." అని అంటాడు. అప్పుడు తెలివితేటలతో లక్షల కోట్ల సంపదను సృష్టించవచ్చునేమో కానీ, ఒక్క బియ్యపు గింజను కూడా సృష్టించలేము అన్న స్పృహ కలిగి తీరుతుంది, ప్రజలకు ప్రభుత్వాలకు.

"ఆకలి అనే శత్రువు జనం మీద దాడి చేసినప్పుడు ఆహారం అనే ఆయుధంతో ఎదుర్కోవాలి. అప్పుడు దేశంలో రైతు లేకపోతే ప్రజలు బతకలేరు అన్న సత్యం తమంత తాముగా తెలుసుకుంటారు. రాజ్యాంగ నిర్మాతలు– దేశ ప్రజలకు కత్తిని చేతికి ఇవ్వలేదు. ఓటు హక్కును ఆయుధంగా ఇచ్చారు. దానిని నమ్ముకుని రాజులే అవుతారో, అమ్ముకుని బానిసలే అవుతారో.. అది ప్రజల చేతిలో ఉందన్న' సందేశం ఈ నాటిక ఇస్తోంది. రైతు తన పంట ధరను తానే నిర్ణయించే అవకాశం ఉన్నప్పుడు రైతే రాజుగా ఉంటాడు.' అన్న ఊహ, ఆశ ప్రేక్షకులను రైతు పక్షంగా ఆలోచింపజేస్తోంది. ఇది వాస్తవమై అమల్లోకి రావాలని ప్రతి ప్రేక్షకుడూ మనసారా కోరుకుంటాడు. సంభాషణల చాతుర్యంతో తుది వరకు ఆసక్తికరంగా వీక్షించేలా రచయిత, దర్శకుడు ఈ నాటికను దృశ్యమానం చేశారు. నటీనటుల ప్రతిభ ఆకట్టుకుంది. కృత్రిమ ఆభరణ శోభిత సౌందర్యంగా కాక, నిరాడంబరతలోని సహజ సౌందర్యం లాగా 'రైతే రాజు' నాటిక – మిగతా నాటికల మధ్య తన ప్రత్యేకతను నిలుపుకుంటుంది.

– మల్లేశ్వరరావు ఆకుల
79818 72655

మార్గదర్శకాలు పాటించండి

- ముందుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కించి ఫలితాన్ని ప్రకటించండి
- సిఇసిని కోరిన ఇండియా బ్లాక్ నేతలు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష ఇండియా బ్లాక్ ప్రతినిధి బృందం ఆదివారం కేంద్ర ఎన్నికల సంఘంతో సమావేశమైంది. మంగళవారం చేపట్టే కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి స్పష్టమైన, సవివరమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరింది. సమావేశం అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేత అభిషేక్ మనుసింఘ్వి మాట్లాడుతూ తొలుత పోస్టల్ బ్యాలెట్లు లెక్కించాలని సిఇసిని కోరామని తెలిపారు. 'ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత వివిధ పార్టీలతో కూడిన ప్రతినిధి బృందం సిఇసితో సమావేశం కావడం ఇది మూడోసారి. అనేక అంశాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాం. ముఖ్యంగా రెండు మూడు అంశాలను ప్రస్తావించాం. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించి, ఫలితాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశాం' అని తెలిపారు.

'ముందుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కించాలని ఎన్నికల కమిషన్ నిబంధనల్లో ఉంది. ఇవిఎంలను లెక్కించడానికి ముందే పోస్టల్ బ్యాలెట్లను లెక్కించి ఫలితాన్ని ప్రకటించాలి. ఈ మార్గదర్శకాన్ని ఇసి పాటించడం లేదు. దానిని పాటించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాల్సిందిగా సిఇసిని కోరాం' అని మను సింఘ్వి చెప్పారు.


ఎన్నికల అధికారులను కలిసివస్తున్న ఇండియా బ్లాక్ నేతలు

కంట్రోల్ యూనిట్లపై సూచనలు : ఏచూరి

తాను నిర్దేశించుకున్న మార్గదర్శకాలను అమలు చేయాలని సిఇసిని కోరినట్లు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. సిసి టీవీల పర్యవేక్షణలో ఉన్న కారిడార్ల ద్వారా ఇవిఎంల కంట్రోల్ యూనిట్లను తరలించాలని, ఆ యూనిట్లలోని సమాచారాన్ని, అందులో చూపిన సమయాన్ని సరిచూసుకోవాలని కోరామని వివరించారు. 'కంట్రోల్ యూనిట్లను సరిచూసుకోవడం చాలా ముఖ్యం. లేకుంటే అది పోలింగ్ కేంద్రం నుంచి వచ్చిన యూనిట్ అని, దానిని మార్చలేదని నిర్ధారించుకోవడం సాధ్యపడదు' అని తెలిపారు. పోలింగ్ తేదీ, ఆ ప్రక్రియ మొదలైన సమయం, ముగిసిన సమయాన్ని కంట్రోల్ యూనిట్‌లో సరిచూసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఇవిఎంలకు సీలు వేసేటప్పుడు దానిపై ఉంచే స్లిప్పులు, ట్యాగులను వెరిఫికేషన్ కోసం కౌంటింగ్ ఏజెంట్లకు చూపించాలని ఏచూరి సూచించారు.

ఇండియా బ్లాక్ నేతలు శనివారం సమావేశమై కౌంటింగ్ రోజు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొన్ని అంశాలపై సిఇసితో సమావేశమవుతామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని ప్రతిపక్ష పార్టీలు తమ ఏజెంట్లకు సూచించాయి. ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలైన ఓట్లను నమోదు చేసే ఫారం 17-సిని తీసుకోవాలని కోరాయి.

సార్వత్రికంపై లక్ష కోట్ల వ్యయం !

న్యూఢిల్లీ : ఈ నెల 1వ తేదీతో ఏడు దశల సార్వత్రిక ఎన్నికల పోరు ముగిసింది. ఈ ఎన్నికల్లో సుమారు లక్ష కోట్ల రూపాయలు ఖర్చయ్యాయని అంచనా. ప్రపంచంలో జరిగిన ఖరీదైన ఎన్నికల్లో ఇది కూడా ఒకటని చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి రూ.75-95 లక్షలు మించి ఖర్చు పెట్టరాదని నిబంధనలు స్పష్టం చేస్తున్నప్పటికీ వాటిని ఎవరూ ఖాతరు చేయలేదు. 1951-52లో జరిగిన తొలి సాధారణ ఎన్నికల్లో అభ్యర్థి గరిష్ట వ్యయ పరిమితిని రూ.25,000గా నిర్ణయించారు. 2019 ఎన్నికల్లో ఒక్కో నియోజకవర్గంలో సుమారు రూ.100 కోట్ల వరకూ ఖర్చయ్యుండని అంచనా. ప్రస్తుత ఎన్నికల్లో అది మరింతగా పెరిగిపోయింది. ప్రధాని నరేంద్ర మోడీ తన ఎన్నికల ప్రచారంలో భాగంగా 206 ర్యాలీలు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఐదు సంవత్సరాల క్రితం జరిగిన ఎన్నికల సందర్భంగా ఆయన 145 సభలు, కార్యక్రమాలకు మాత్రమే హాజరయ్యారు. కన్యాకుమారిలోని వివేకానంద రాక్‌లో 45 గంటల పాటు ధ్యానం చేయడానికి ముందు మోడీ మీడియాకు 80 ఇంటర్వ్యూలు ఇచ్చారు. కాంగ్రెస్ విషయానికి వస్తే పార్టీ నేతలు రాహుల్ గాంధీ 107, ప్రియాంక గాంధీ 108 కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎన్నికల కమిషన్ అధికారులు సముద్ర యానం చేసి ఇవిఎంలను లక్షద్వీప్‌లోని మారుమూల ప్రాంతాలకు తరలించారు. గుజరాత్‌లోని గిర్ సోమనాథ్ జిల్లాలో ఒకే ఒక్క ఓటరు కోసం బనెజ్ గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

నేటి నుంచి టోల్ బాదుడు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా టోల్ గేట్ ఛార్జీలు మూడు నుంచి ఐదు శాతం సోమవారం నుంచి పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని టోల్ ఛార్జీల పెంపును వాయిదా వేసిన కేంద్రం ఎన్నికలు ముగియడంతో ఈ నెల 3 నుంచి పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. దేశంలో టోల్ ఛార్జీలు ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఏటా సవరిస్తున్నారు. సోమవారం నుండి దాదాపు 1,100 టోల్ ప్లాజాల వద్ద పెంచిన ఛార్జీలను వాహనాల నుంచి వసూలు చేస్తున్నట్లు హైవే ఆపరేటర్లు ఇప్పటికే వార్తా పత్రికల్లో నోటీసులిచ్చారు. "ఎన్నికల ప్రక్రియ ముగిసినందున, ఎన్నికల సమయంలో నిలిపివేసిన వినియోగదారు రుసుము రేట్ల సవరణ జూన్ 3 నుండి అమలులోకి వస్తుంది" అని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాలోని సీనియర్ అధికారి రాయిటర్స్‌తో చెప్పారు. వార్షిక ఛార్జీల పెంపును ప్రతిపక్ష పార్టీలు, వాహనదారులు విమర్శిస్తున్నారు. అవి నిత్యావసర వస్తువుల రవాణా ఖర్చులు, ప్రయాణికులపై భారాన్ని పెంచుతాయన్న ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐఆర్‌బి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్, అశోక్ బిల్డ్‌కాన్ లిమిటెడ్ వంటి ఆపరేటర్లు టోల్ పెంపు వల్ల భారీగా లాభాలు పొందుతుండగా, సామాన్యులపై ఈ పెంపు తీవ్ర ప్రభావం చూపుతోంది. 2018-19లో టోల్ వసూళ్లు రూ.2,520 కోట్లు ఉండగా, 2022-23 నాటికి రూ.5,400 కోట్లకు పెరిగింది.

వంద రోజుల అజెండాపై మోడీ సమీక్ష

న్యూఢిల్లీ : మళ్లీ తమ ప్రభుత్వం వచ్చే అవకాశముందని ఎగ్జిట్ పోల్స్ నివేదికలు వచ్చిన నేపథ్యంలో... వంద రోజుల అజెండా అమలుపై ప్రధాని నరేంద్రమోడీ ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి భారత ప్రభుత్వ సీనియర్ అధికారులు హాజరయ్యారు. యుపిఎస్‌సి ఫౌండేషన్ కోర్సులను సమీక్షించడం, సివిల్ సర్వెంట్లకు రేటింగ్ ఇవ్వడం, జమిలీ ఎన్నికల కోసం ఉమ్మడి ఓటర్ల జాబితాను రూపొందించడం వంటి ప్రణాళికలపై చర్చించారు. తమ ఎజెండాను అమలు చేయడానికి కనీసం 10 గ్రూపులు ఏర్పాటు చేయడంతోపాటు ఒక్కో కార్యదర్శి స్థాయి అధికారిని సమన్వయకర్తగా నియమిస్తారు. ఈ ప్రణాళికలు జులై 1 నాటికి అమలులోకి వస్తాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

దేశాన్ని రక్షించండి

- తీహార్ జైలులో లొంగిపోయే ముందు ప్రజలకు కేజ్రీవాల్ పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశాన్ని రక్షించాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రజలకు పిలుపునిచ్చారు. తాను ఈ 21 రోజుల్లో ఒక్క నిమిషాన్ని కూడా వృథా చేయలేదని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా దేశాన్ని రక్షించాలని ప్రజలకు సూచించానన్నారు. ముందు దేశం ముఖ్యమని, ఆ తరువాతే ఆమ్ ఆద్మీ పార్టీ అని ఆయన పేర్కొన్నారు. తీహార్ జైల్లో లొంగిపోయే ముందు ఆమ్ ఆద్మీ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కేజ్రీవాల్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తనకు ఇచ్చిన మధ్యంతర బెయిల్ పూర్తిగా ఫలవంతమైందని అభిప్రాయపడ్డారు. ఈ ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోడీ, తనకు వ్యతిరేకంగా ఒక్క ఆధారాన్నీ చూపించ లేకపోయారన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ నియంత పాలనకు నిదర్శనమని చెప్పారు. ఈ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పూర్తి మెజార్టీ సాధిస్తుందనే, ఏ ఆధారం లేకుండా తనను జైల్లో పెట్టారని కేజ్రీవాల్ విమర్శించారు. తనను జైలులో పెట్టడంతో దేశంలో ఎవరినైనా జైలుకు పంపుతామనే సందేశాన్ని ఈ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినట్లయిందని అభిప్రాయపడ్డారు.

ఎగ్జిట్ పోల్స్ తప్పుడు అంచనాలు

బిజెపి మూడోసారి అధికారంలోకి వస్తుందంటూ ఎగ్జిట్ పోల్స్ వేసిన అంచనాలు తప్పని కేజ్రీవాల్ అన్నారు. 'ఎగ్జిట్ పోల్స్‌వి తప్పుడు అంచనాలని నేను మీకు లిఖితపూర్వకంగా రాసి ఇస్తాను. రాజస్థాన్‌లో 25 పార్లమెంట్ స్థానాలు ఉంటే ఓ ఎగ్జిట్ పోల్ బిజెపికి 33 సీట్లు వస్తాయని చెప్పింది. బూటకపు ఫలితాలు ఎందుకు విడుదల చేశారు?' అని ఆయన ప్రశ్నించారు.

ఎగ్జిట్ పోల్స్ మైండ్ గేమ్స్ అని, అవి మిమ్మల్ని కుంగుబాటుకు గురిచేస్తాయని కార్యకర్తలను హెచ్చరించారు. కౌంటింగ్ సమయంలో జాగ్రత్తగా ఉండాలని ఇండియా బ్లాక్ పార్టీలకు చెప్పానని, చివరి వరకూ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రంలోనే ఉండేలా చూడాలని కోరానని తెలిపారు. ఈ సమావేశంలో కేజ్రీవాల్ భార్య సునీత, పార్టీ నాయకులు, ఢిల్లీ మంత్రులు అతిషీ, కైలాశ్ గెహ్లాట్, సౌరభ్ భరద్వాజ్, రాజ్యసభ ఎంపిలు సంజయ్ సింగ్, సందీప్ పాఠక్‌తోపాటు దుర్గేశ్ పాథక్, రాకీ బిర్లా, రీనా గుప్తా పాల్గొన్నారు.

అస్సాంలో ఆగని వరదలు

- 15 మంది మృతి
- 10 జిల్లాలపై ప్రభావం

గౌహతి : అస్సాంలో వరదలు కొనసాగుతున్నాయి. వరదల కారణంగా మే 28 నుంచి ఆదివారం నాటికి 15 మంది మరణించినట్లు అధికారులు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, బాధిత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని తెలిపారు. వరదల కారణంగా హైలాకండి హోజాయ్, మోరిగావ్, కరీంగంజ్, నాగావ్, కాచర్, దిబ్రూఘర్, గోలాఘట్, కర్బీ అంగ్లాంగ్ వెస్ట్, డిమా హసావో జిల్లాల్లోని మొత్తంగా 6,01,642 మంది ప్రభావితమయ్యారని అధికారులు చెప్పారు. నాగావ్ జిల్లా అత్యధికంగా ప్రభావానికి గురైనట్లు చెప్పారు. కొపిలి, బరాక్, కుషియార నదులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. సహాయ శిబిరాల్లో 50 వేల మంది నిరాశ్రయులు తలదాచుకుంటున్నారు. ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, స్థానిక బృందాలు సహాయక, పునరావాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో రోడ్డు, రైలు సేవలు నిలిచిపోయాయి. సోమవారం వరకూ కనీసం 10 రైళ్లను రద్దు చేశారు.

దక్షిణాఫ్రికాలో హంగ్ పార్లమెంట్

- సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుపై ఎఎన్‌సి దృష్టి
- ఇది సంకీర్ణాల యుగం: ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్

జొహానెస్‌బర్గ్ : దక్షిణాఫ్రికా సార్వత్రిక, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎఎన్‌సి)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2019లో 57.5 శాతం ఓట్లు సాధించిన ఆ పార్టీ ఈ సారి 41శాతం ఓట్లు మాత్రమే సాధించింది. 400 స్థానాలు ఉన్న పార్లమెంటులో మెజార్టీ సీట్లు సాధించేందుకు అవసరమైన 50శాతానికిపైగా ఓట్లు సాధించడంలో విఫలమైంది. దామాషా పద్ధతిన జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఏ పార్టీకి ఎంత ఓటింగ్ శాతం వచ్చిందనే దానిని బట్టి ఆ పార్టీకి పార్లమెంటరీ సీట్లు కేటాయించబడతాయి. ఆ లెక్కన ఎఎన్‌సికి ఇప్పుడు లభించిన ఓటింగ్ శాతాన్ని బట్టి 160 నుంచి165 సీట్ల దాకా రావచ్చు. పార్లమెంటులో ఏకైక అతి పెద్ద పార్టీగా అది ఆవిర్భవిస్తుంది. కానీ, మెజార్టీకి అవసరమైన 201 సీట్లు మార్కును చేరుకోవాలంటే ఇతర పార్టీల సహకారం అవసరం. ప్రస్తుతం సంకీర్ణ భాగస్వాముల కోసం అది సంప్రదింపులు చేపట్టే పనిలో ఉంది. వర్ణ వివక్ష నుండి 1994లో దక్షిణాఫ్రికా విముక్తి పొందిన తరువాత వరుసగా జరిగిన ఆరు పార్లమెంటు ఎన్నికల్లో తిరుగులేని మెజార్టీతో ముప్పయ్యేళ్లపాటు అధికారంలో నిరాఘాటంగా కొనసాగుతూ వచ్చిన ఎఎన్‌సి మొదటిసారి మెజార్టీ సాధించడంలో విఫలమైంది. దీనికి నైతిక బాధ్యత వహించి అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా (71) తప్పుకోవాలని ఆయనకు బద్ధ విరోధి, అవినీతి ఆరోపణలతో 2018లో అధ్యక్ష పదవి నుంచి తొలగించబడిన జాకోబ్ జుమా (82) డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను ఎఎన్‌సి తిరస్కరించింది. ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందిందన్న యూరప్ దేశాల్లోనే సంకీర్ణ ప్రభుత్వాలు నడుస్తున్నాయని ఎఎన్‌సి ప్రధాన కార్యదర్శి ఫికిల్ ఎంబెలూలా చెప్పారు. సంకీర్ణాలు ఇప్పటివరకు రాష్ట్రాల స్థాయిలోనే ఉండేవి. ఇప్పుడు జాతీయ స్థాయికి వచ్చాయి అని ఆయన అన్నారు. సుస్థిరమైన పాలన అందించేందుకు సరైన సంకీర్ణ నమూనా కోసం అధ్యయనం చేస్తున్నామని ఆయన చెప్పారు.


మీడియాతో మాట్లాడుతున్న ఎఎన్‌సి అధికార ప్రతినిధి మాబుల్లా

జాన్ స్టీన్ హుస్సేన్ (48) నాయకత్వంలోని మధ్యేవాద మితవాద డెమొక్రటిక్ అలయెన్స్ (డిఎ) పార్టీ 21.68 శాతం ఓట్లతో రెండవ అతిపెద్ద పార్టీగా నిలవగా, జాకబ్ జుమా నాయకత్వంలోని ఎంకెపి 14,71 శాతం ఓట్లు సాధించి మూడవ అతి పెద్ద పార్టీగా నిలిచింది. కోర్టు ధిక్కార కేసులో జైలు శిక్ష పడిన జుమాను ఎన్నికల్లో పాల్గొనకుండా అనర్హత వేటు వేయడంతో ఆయన సొంతంగా ఎంకె పార్టీని స్థాపించాడు. ఎఎన్‌సి నుంచి బయటకు వచ్చిన యూత్ లీడర్ జులియస్ మలేమా (43) నేతృత్వంలో ఏర్పాటైన ఎకనమిక్ ఫ్రీడమ్ ఫైటర్స్ (ఇఎఫ్ఎఫ్) పార్టీ 9.46 శాతం ఓట్లతో నాల్గవ స్థానంలో నిలిచింది.

2019 ఎన్నికల్లో ఎఎన్‌సికి 57.5 శాతం ఓట్లు, 230 సీట్లు రాగా, డిఎ పార్టీకి 21 శాతం ఓట్లు 84 సీట్లు, ఇఎఫ్ఎఫ్ 11 శాతం ఓట్లు 44 సీట్లు వచ్చాయి. ఇంకతా ఫ్రీడమ్ పార్టీ 3.5 శాతం ఓట్లతో 14 సీట్లు సాధించింది. చిన్న చితక పార్టీలు మిగతా 28 సీట్లను దక్కించుకున్నాయి.

రాబోయే కొత్త ప్రభుత్వం ఏదైనా ప్రత్యేక హోదా కోసం కృషి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. జిడిపి, ప్రాథమిక సదుపాయాల కల్పనలో మార్పులేదని, నాడు-నేడు పెట్టిన తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో ఐదు లక్షల మంది పిల్లలు తగ్గారని పేర్కొన్నారు.

పెరిగిన రాష్ట్ర అప్పులు

రాష్ట్రంలో ప్రజలపై అప్పులు పెరిగాయని, మొత్తాన్ని అప్పులమయం చేశారని అన్నారు. కార్పొరేట్ కంపెనీలు మాత్రం బ్యాంకుల దగ్గర రుణాలు తీసుకుని ఎగ్గొట్టి బాగుపడ్డాయని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ రూ.62 వేలు అప్పు ఉన్నారని, ప్రజలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వీటిని ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు. రాజకీయ రంగంలో పోటీ చేసిన అభ్యర్థులను చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులు కలిగిన అభ్యర్థులు టిడిపి, బిఆర్ఎస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలవారేనని తెలిపారు. టాప్ టెన్లో ఐదుగురు దక్షిణాది వాళ్లేనని, పార్టీల వారీగా టిడిపి, వైసిపి టాప్‌లో ఉన్నాయని అన్నారు. అతి తక్కువ ఆస్తులు కలిగిన అభ్యర్థులు సిపిఎం వారేనని పేర్కొన్నారు. ఎడిఆర్ ఈ వివరాలు తెలిపిందని అన్నారు. పేదవాళ్లను ఎన్నికల్లో నిలబెట్టి ప్రజలకే అధికారం అనే నినాదాన్ని తూచ తప్పకుండా అమలు చేస్తున్నామని చెప్పారు. మిగిలిన పార్టీలు ప్రజల పేరు చెప్పి కార్పొరేట్లకు దోచిపెడుతున్నాయన్నారు. ప్రజల ఆరోగ్యం, విద్య, ఉపాధి, పారిశ్రామిక కార్మికుల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నిలబెట్టడానికి ఈ ఎన్నికల్లో టిడిపి, వైసిపి కనీస అజెండా కూడా చేయలేదని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి అది శాపంగా మారిందని పేర్కొన్నారు.

డయేరియాపై ప్రత్యేక అధికారిని నియమించాలి

ఆరోగ్య సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని తెలిపారు. రాష్ట్రానికి రాజధాని, నడిబొడ్డున ఉన్న విజయవాడలో డయేరియా వచ్చి తొమ్మిది మంది చనిపోతే పట్టించుకునే నాథుడు లేడని శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే దీనిపై ప్రత్యేక అధికారిని నియమించి జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. డయేరియాపై అధికారంలో ఉన్నవారు స్పందించలేదని, ఆరోగ్యశాఖ మంత్రి ఎక్కడున్నారో అడ్రస్ లేదని, ఎన్నికల అనంతరం వేసవి విడిదికి వెళ్లారో ఏమో తెలియదని పేర్కొన్నారు. విజయవాడ మున్సిపల్ కమిషనర్ నిద్రపోతున్నారని, వైఫల్యం బయటపడుతుందని డయేరియా మరణాలు లేవంటూ పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. కళ్లున్నా చూడలేని, కబోదుల్లా వ్యవహరిస్తున్నారని ఆగ్రహించారు. కమిషనరు జాగ్రత్తగా వ్యవహరించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతారా లేదా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సాధ్యం కాకపోతే అతన్ని తొలగించాలని అన్నారు. ఒకపక్క డయేరియా లేదని చెబుతూనే స్థానికంగా ఉన్న సిపిఎం కార్యాలయంలో పడకలు వేసి చికిత్స అందిస్తున్నారని, ప్రభుత్వాస్పత్రిలో 30 పడకలు ఏర్పాటు చేశారని, అది రహస్యం కాదని, రోజురోజుకూ పెరుగుతోందని తెలిపారు. ఆరునెలల క్రితం గుంటూరులోనూ ఇలాగే జరిగిందని తెలిపారు. పక్కనే కృష్ణానది ఉన్నా రక్షిత మంచినీళ్లు సరఫరా చేయలేకపోతున్నారని, దీన్ని అభివృద్ధి అంటారా? అని ప్రశ్నించారు.

జిఒ 596ను వ్యతిరేకించింది సిపిఎం మాత్రమే

596 జిఒను వ్యతిరేకించింది సిపిఎం మాత్రమేనని శ్రీనివాసరావు అన్నారు. అసెంబ్లీలో వైసిపి జిఒ 596 బిల్లును పెట్టిన సమయంలో టిడిపి కూడా ఆకాశానికి ఎత్తిందని, ఇద్దరూ కలిసి ఆమోదించారని తెలిపారు. బిజెపి ఆధ్వర్యంలో కేంద్రం దీన్ని ప్రవేశపెట్టమందని తెలిపారన్నారు. 596 జిఒను రద్దుచేసి అసైన్‌మెంట్ ల్యాండ్స్‌ను అసలైన లబ్ధిదారులకు తిరిగి ఇచ్చేయాలని, జిఒ వచ్చిన తరువాత జరిగిన లావాదేవీలను రద్దు చేసి విచారణ జరిపించాలని కోరారు. దీనిలో అధికార పార్టీ, అధికారుల హస్తం ఉందని తెలిపారు. దుర్మార్గంగా కోట్ల విలువ చేసే భూములను కాజేశారని అన్నారు. భావితరాలకు దీనివల్ల తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ రద్దుచేసి విచారణ చేస్తేనే పేదలకు లబ్ధి కలుగుతుందని తెలిపారు.


రఫాపై దాడులకు బాంబులు ఇస్తున్న మోడీ

పాలస్తీనాలోని రఫా నగరం మీద వారం రోజులుగా ఇజ్రాయిల్ దాడులు చేస్తోందని, దీనికి అవసరమైన మారణాయుధాలను మోడీ ప్రభుత్వం పంపిస్తోందని అన్నారు. భారత ఆయుధాల నౌకను స్పెయిన్ ఆపేసిందని, దీనికి ప్రభుత్వం సిగ్గుపడాలని తెలిపారు. రఫాలో ప్రజల మారణహోమాన్ని అన్ని దేశాలూ వ్యతిరేకిస్తున్నాయని, అమెరికా, భారత్‌లాంటి దేశాలు మాత్రం సమర్థిస్తున్నాయని, పైగా ఆయుధాలనూ సరఫరా చేస్తున్నాయని తెలిపారు. అక్కడ ప్రజల మరణాలను తట్టుకోలేని స్పెయిన్ భారత్ ఆయుధాల నౌకను ఆపేసిందని, ఇంతకంటే సిగ్గుచేటు మరొకటి లేదని అన్నారు.

మెక్సికో అధ్యక్ష పీఠంపై తొలిసారి మహిళ

మెక్సికో సిటీ: మెక్సికో అధ్యక్ష పదవికి మొదటిసారి ఓ మహిళ ఎన్నిక కానున్నారు. దేశ అధ్యక్షపదవికి, పార్లమెంటు దిగువ సభకు, సెనేట్‌కు, ఎనిమిది రాష్ట్రాల గవర్నర్ల పదవులకు, అలాగే మెక్సికో సిటీ మేయర్ పదవికి ఆదివారం ఎన్నికలు జరిగాయి. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు మొదలైంది. అధ్యక్ష బరిలో రెండు ప్రధాన కూటముల నుంచి మహిళలే పోటీలో ఉన్నారు. ఒకరు వామపక్ష వాది మోరెనా పార్టీకి చెందిన క్లాడియా షిన్‌బామ్ కాగా, మరొకరు మితవాద పార్టీ 'ఫోర్స్ అండ్ హార్ట్ ఫర్ మెక్సికో కొయిలేషన్' కు చెందిన సొచిల్లి గాల్వెజ్. సిటిజెన్స్ మూవ్‌మెంట్ పార్టీ తరపున ఓ పురుష అభ్యర్థి జోర్గె అల్వారెజ్ పోటీలో ఉన్నప్పటికీ అతనికి 12 శాతానికి మించి ఓట్లు రాకపోవచ్చని సర్వేలు తేల్చాయి. లాటిన్ అమెరికాలో రెండవ అతిపెద్ద దేశమైన మెక్సికోకు ఒక మహిళ తొలిసారి అధ్యక్ష పదవికి ఎన్నిక కావడం తథ్యం. లెఫ్ట్ వింగ్‌కు చెందిన 61 ఏళ్ల క్లాడియా షిన్‌బామ్‌కు 50 శాతం దాకా ఓట్లు వచ్చే అవకాశముందని ఒపీనియన్ పోల్స్ అంచనా. ఆమె పార్టీ సహచరుడు, ప్రస్తుత అధ్యక్షుడు ఆండ్రిస్ మాన్యుయెల్ లోపెజ్ ఒబ్రడార్ (ఆమ్లో) అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక నయా ఉదారవాద విధానాలకు అడ్డుకట్ట వేసి, ప్రజానుకూల విధానాలకు పెద్ద పీట వేశారు. నాల్గవ ట్రాన్స్‌ఫర్మేషన్ (4టి) ప్రాజెక్టు పేరుతో కనీస వేతనాల పెంపు వంటి పలు విధానాలు ప్రజల ఆదరణను చూరగొన్నాయి. అంతకుముందున్న ప్రభుత్వాలు మెక్సికోలోని కులీన వర్గాలు (అధిక సంపన్న వర్గాలు) సేవలో తరిస్తూ, అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలతో రోసిపోయాయి. ఒబ్రడార్ ఆరేళ్ల ప్రజా రంజక పాలన షీన్‌బామ్‌కు బాగా కలిసొచ్చింది. షిన్‌బామ్ ప్రధాన ప్రత్యర్థి సొచిల్లి గాల్వెజ్ గతంలో చాలా కాలంగా మెక్సికోను పాలించిన, బద్ధ విరోధులైన పిఆర్ఐ, పిఎఎన్‌లతో కూటమి కట్టారు. సాంప్రదాయక కులీనులకు సేవ చేయడమే ఈ కూటమి లక్ష్యం.


క్లాడియా షిన్‌బామ్


సొచిల్లి గాల్వెజ్

చాంగే-6 ల్యాండ్ సక్సెస్

- చైనా అంతరిక్ష ప్రయోగాల్లో కీలక ముందడుగు

చైనా : చైనాకు చెందిన లూనార్ ల్యాండర్ చాంగే-6 విజయవంతంగా జాబిల్లి ఆవలి వైపు ల్యాండయినట్లు చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ ప్రకటించింది. బీజింగ్ కాలమానం ప్రకారం.. ఆదివారం ఉదయం అయిట్కిన్ బేసిన్ పేరిట ఉన్న ప్రదేశంలో చాంగే-6 సురక్షితంగా ఉపరితలాన్ని తాకినట్లు పేర్కొంది. ఆ దేశ అంతరిక్ష ప్రయోగాల్లో ఇదొక కీలక ముందడుగు. ఇప్పటి వరకు ప్రయోగించిన వాటిల్లో ఇదే అత్యాధునికమైంది. అక్కడి నమూనాలను సేకరించిన తర్వాత ఇది తిరిగి భూమికి బయలుదేరనుంది. గతంలో 2019లో కూడా చైనా చాంగే-4ను చంద్రుడి ఆవలివైపునకు ప్రయోగించింది. తాజాగా పంపిన ఈ మిషన్‌లో ఆర్బిటర్, ల్యాండర్, అసెండర్, రీఎంట్రీ మాడ్యూల్ అనే నాలుగు రకాల పరికరాలున్నాయి.

అంబానీని దాటేసిన అదానీ

- ఆసియాలో అత్యంత ధనవంతుడి హోదా



న్యూఢిల్లీ : గౌతమ్ అదానీ మళ్లీ ఆసియాలో అత్యంత ధనవంతుడిగా నిలిచారు. ఆపిల్స్ వ్యాపారం నుంచి ఎయిర్‌పోర్టుల వ్యాపారానికి సంబంధించిన షేర్ల ధరలు పెరగడంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీని అధిగమించి మరోసారి ఆసియాలో అత్యధిక ధనవంతుడి హోదాను సంపాదించుకున్నారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ జాబితా ప్రకారం 109 బిలియన్‌డాలర్ల సంపదతో అంబానీ ప్రపంచ కుబేరుల్లో 12వ స్థానంలో ఉన్నారు. అదానీ 111 బిలియన్ డాలర్ల సంపదతో 11వ స్థానంలో నిలిచారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ సమాచారం మేరకు అదానీ గ్రూపు కంపెనీల షేర్లు శుక్రవారం ఏకంగా 14 శాతం పెరిగాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి 10 అదానీ గ్రూప్ లిస్టెడ్ సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.17.51 లక్షల కోట్లకు చేరుకుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి మందగమనంలో ఉన్నప్పటికీ 2022లో తన వ్యక్తిగత సంపద భారీగా పెరగడంతో తొలిసారిగా అంబానీని అధిగమించి ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా నిలిచారు. హిండెన్‌బర్గ్ నివేదిక సృష్టించిన ప్రకంపనలతో గత ఏడాది జనవరిలో అదానీ గ్రూపు సంస్థల షేర్లు భారీగా దెబ్బతిన్నాయి. దీంతో అంబానీ మళ్లీ ఆసియాలో అత్యంత ధనవంతుడిగా నిలిచారు. ఇప్పుడు మళ్లీ అదానీ ఆ స్థానాన్ని దక్కించుకున్నారు. 1988లో సొంతంగా కంపెనీని స్థాపించిన అదానీ సంపద గత పదేళ్లలో భారీగా పెరిగింది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు అంటే 2014లో 5 బిలియన్ డాలర్లుగా ఉన్న అదానీ సంపద 2022 చివరి నాటికి 121 బిలియన్ డాలర్లకు చేరుకుంది. 2022లో కొన్ని వారాల పాటు ప్రపంచంలో రెండో అత్యంత సంపన్న వ్యక్తిగా ఉన్నారు.

బెంగాల్‌లో రెండు బూత్‌ల్లో రీపోలింగ్

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో రెండు బూత్‌ల్లో రీపోలింగ్‌కు ఎన్నికల కమిషన్ ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. బరసత్ లోక్‌సభ నియోజకవర్గంలో ఒక బూత్‌లోనూ, మధురాపూర్ లోక్‌సభ నియోజకవర్గంలో ఒక బూత్‌లో రీపోలింగ్‌కు కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరగనుంది. రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత పరిశీలకులు ఇచ్చిన నివేదికల ఆధారంగా ఇసి ఈ ఆదేశాలు ఇచ్చింది. ఈ రెండు బూత్‌ల్లోనూ ఏడో దశలో భాగంగా ఈ నెల 1న పోలింగ్ జరిగింది.

జార్ఖండ్ ఏడో దశలో 70.88 శాతం ఓటింగ్

జార్ఖండ్‌లో ఏడో దశ ఎన్నికల్లో 70.88 శాతం ఓటింగ్ నమోదయింది. ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కె రవికుమార్ ఆదివారం వెల్లడించారు. ఇక్కడ జరిగిన మొత్తం నాలుగు దశల్లోనూ 66.19 శాతం ఓటింగ్ నమోదైందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం 14 లోక్‌సభ స్థానాలకు గాను 12 స్థానాల్లో మహిళా ఓటర్లే అధికమని చెప్పారు.

నేడు ఇసి ప్రెస్‌మీట్

లోక్‌సభ ఎన్నికల ఫలితాల వెల్లడికి ఒక రోజు ముందు అంటే సోమవారం ఇసి విలేకరుల సమావేశం నిర్వహించనుంది. ఈ విధంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం బహుశా ఇదే మొదటిసారిగా నిపుణులు భావిస్తున్నారు.

ఎగ్జిట్ పోల్స్ బోగస్ : జైరాం రమేష్


న్యూఢిల్లీ : ఎగ్జిట్ పోల్స్ బోగస్ అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ అన్నారు. ఎన్నికల్లో రిగ్గింగ్‌ను సమర్థించుకోవడానికి ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ రాష్ట్రాల పిసిసి అధ్యక్షులు, పార్టీ శాసనసభాపక్ష నేతలతో జూమ్‌లో సంప్రదింపులు జరిపిన అనంతరం జైరాం రమేష్ ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో మెరుగైన ఫలితాలు వస్తాయని, కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ నాయకులు జూమ్‌లో మాట్లాడుతూ ఎగ్జిట్ పోల్స్ అంచనాల కంటే తాము మంచి ఫలితాలనే సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అసోంలో కనీసం ఏడు స్థానాలు గెలుచుకుంటామని ఆ రాష్ట్ర పిసిసి అధ్యక్షుడు భూపేన్ బోరా తెలిపారు. పంజాబ్‌లో పది సీట్లు వస్తాయని, ఎన్‌డిఎకు ఒక్కటీ రాదని శాసనసభలో ప్రతిపక్ష నేత ప్రతాప్ సింగ్ బజ్వా చెప్పారు. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ రెండు స్థానాలు గెలుచుకుంటుందని, మరో రెండింటిలో తీవ్ర పోటీ ఉన్నదని ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు చెప్పారు. మూడింట రెండు వంతుల స్థానాలు హస్తగతం చేసుకుంటామని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పోటీ చేసిన తొమ్మిది లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ 6-7 సీట్లు కైవసం చేసుకుంటుందని బీహార్ పిసిసి అధ్యక్షుడు అఖిలేష్ ప్రసాద్ సింగ్ తెలిపారు. మహారాష్ట్ర, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ పిసిసి అధ్యక్షులు కూడా కాంగ్రెస్ విజయంపై ఆశాభావం వ్యక్తం చేశారు.

బైడెన్ మూడంచెల ప్రణాళికకు నెతన్యాహు అంగీకరిస్తారు : వైట్ హౌస్

గాజా సిటీ: గాజాపై ఎనిమిది మాసాలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న నరహంతక దాడులకు ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ ముందుకు తెచ్చిన మూడంచెల కాల్పుల విరమణ ప్రతిపాదనకు హమాస్ సానుకూలంగా స్పందించినప్పటికీ నెతన్యాహు ప్రభుత్వం అంగీకరిస్తుందని వైట్‌హౌస్ జాతీయ భద్రతా సలహాదారు పేర్కొన్నారు. పాశ్చాత్య మీడియా తెలిపింది. అయితే, ఈ డీల్ లోపభూయిష్టంగా ఉందని, దీనిని ప్రకటించే ముందు మరింత కసరత్తు జరగాల్సిన అవసరముందని నెతన్యాహు విదేశీ వ్యవహారాల సలహాదారు ఒఫిర్ పాక్ చెప్పారు. హమాస్ ఈ మూడంచెల ప్రణాళికను అంగీకరిస్తున్నామని ప్రకటించిన మరుసటి రోజు నెతన్యాహు ఒక ప్రకటన చేస్తూ గాజాలో యుద్ధాన్ని ముగించడానికి ఇంకా చాలా చేయాల్సి ఉందన్నట్లు మాట్లాడారు. వైట్ హౌస్ జాతీయ భద్రతా ప్రతినిధి జాన్ కిర్బీ ఆదవారం ఎబిసి న్యూస్ చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ఈ ప్రతిపాదన నిజానికి నెతన్యాహు నుంచి వచ్చినదేనని అన్నారు. హమాస్ అంగీకరిస్తే ఇజ్రాయిల్ కూడా దీనికి ఎస్ చెబుతుందని అన్నారు. మరో వైపు నెతన్యాహు కేబినెట్‌లో పచ్చి మితవాద గ్రూపునకు చెందిన ఇద్దరు మంత్రులు ఈ ప్రణాళికకు నెతన్యాహు అంగీకరిస్తే తాము కేబినెట్ నుంచి వైదులొగుతామని బెదిరించారు. అమెరికా ప్రభుత్వం ఇజ్రాయిల్ దుర్మార్గాలకు వంత పాడుతున్నందుకు దేశీయంగా, అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు ఎదురవుతుండడంతో వాటి నుంచి దృష్టి మళ్లించేందుకే బైడెన్ ఈ ప్రతిపాదన తీసుకొచ్చారని అంతర్జాతీయ నిపుణులు వ్యాఖ్యానించారు. బైడెన్ తెచ్చిన ప్రతిపాదనలో కాల్పుల విరమణ, బందీల విడుల, పునర్నిర్మాణానికి పిలపునిచ్చింది. ఈ ప్రతిపాదనను సానుకూలంగా చూస్తున్నట్లు హమాస్ తెలిపింది.

వేసవి విడిది

లేపాక్షి చూశాం..




హాయ్ ఫ్రెండ్స్,

నా పేరు వై. మాధవ్, నేను 8వ తరగతి చదువుతున్నాను. ఈ వేసవి సెలవులకి నేను మా కుటుంబంతో కలిసి అనంతపురం జిల్లా లోని పుట్టపర్తి, దాని చుట్టూ ఉన్న కొన్ని చారిత్రక కట్టడాలను చూశాం. మా పర్యటనలో భాగంగా లేపాక్షి ఆలయాన్ని సందర్శించాం. అక్కడ నంది ఏక శిలపై ఎంతో అందంగా చెక్కారు. అక్కడ నుండి కొంత దూరంలో గల నాగలింగేశ్వర ఆలయం, వీరభద్రుని ఆలయాలని కూడా సందర్శించాం. అక్కడ ప్రతి చోటా ఉన్న రాతి కట్టడాలు, రాతి చెక్కడాలు, రాతి స్తంభాలను చూసి చాలా ఆశ్చర్యపోయాను. ఇంకా, వీరభద్రాలయం, హేంగింగ్ పిల్లర్‌ని అయితే అలా చూస్తూ ఉండిపోయాను. అప్పటి సాంకేతిక పరిజ్ఞానం నన్ను చాలా ఆశ్చర్యపర్చింది. సైన్సు పట్ల మక్కువ ఎక్కువ పెరిగింది. ఈ విహార యాత్ర నాకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని కూడా అందించింది.

– వై. మాధవ్,
8వ తరగతి,
కె.వి స్కూల్, కాకినాడ.

తాజ్ మహల్ చూశాను..



హాయ్ ఫ్రెండ్స్,

నా పేరు శ్రీ సత్య రేణుక. 4వ తరగతి చదువుతున్నాను. నేను ఈ వేసవి సెలవుల్లో ఆగ్రా వెళ్లి తాజ్ మహల్ చూశాను. ఇది పూర్తి పాలరాయి కట్టడం. మొగల్ రాజు షాజహాన్ భార్య ముంతాజ్ బేగం చనిపోవడంతో, షాజహాన్ ఆమె మీద ప్రేమతో తాజ్ మహల్ కట్టించాడని నాన్న చెప్పారు. ఇందులో షాజహాన్, ముంతాజ్‌ల సమాధులు ఉన్నాయి. ఇది భారతదేశ ఏడు ప్రాచీన వింతలలో ఒకటి అని అమ్మ చెప్పింది. పున్నమి వెన్నెల రోజున దీనిని చూస్తే చాలా అందంగా ఉంటుంది.

– వాడ్రేవు సత్య రేణుక,
4వ తరగతి,
అంబాజీపేట,
కోనసీమ జిల్లా.

బొమ్మరిల్లు





భావిశెట్టి హాశ్వంత్,
9వ తరగతి,శ్రీ చైతన్య స్కూల్,
రామచంద్రపురం,కోనసీమ జిల్లా





బొమ్మరిల్లు
పి.లక్ష్మి చరిత,
7వ తరగతి,
ఎ.పి మోడల్ స్కూల్,
ఎం తిమ్మాపురం.





ఎస్‌డి.సుహానా, 3వ తరగతి,
శ్రీ కృష్ణ స్కూల్, పార్వతీపురం,
విజయనగరం జిల్లా.





పి.కోశలశ్రీరామ్,
2వ తరగతి,
ఎంపిపిఎస్
కాని మెరక,
బొండపల్లి,
విజయనగరం.



JEEVANA జీవన the family

జీవన సౌరభం

ఓడిపోతామనే భయంతో
ప్రయత్నించకుండా ఉండటం
కంటే ప్రయత్నించి
ఓడిపోవడం మేలు

స్కూలుకు సిద్ధం చేస్తున్నారా!

వేసవి సెలవులు అయిపోతున్నాయ్. పిల్లలంతా స్కూలుకి వెళ్లే సమయం వచ్చేసింది. ఇప్పటివరకు ఎంచక్కా వేసవి సెలవులు గడిపిన పిల్లలు ఒక్కసారిగా స్కూలుకు వెళ్లాలంటే ఇబ్బంది పడతారు. చిన్న పిల్లలైతే వెళ్లనని మరీ మారాం చేస్తారు. స్కూళ్లు తెరిచిన తరువాత పిల్లలు పేచీ పెట్టకుండా వెళ్లాలంటే, ఇప్పటి నుండే స్కూలుకు సిద్ధం చేయండి.



సెలవుల్లో ఆలస్యంగా నిద్రలేవడం అలవాటై ఉంటుంది. ఉదయం టిఫిన్ దగ్గర నుండి అన్ని అలవాట్లు మారిపోయి ఉంటాయి. ఇప్పటి నుండే వాటిని మార్చడానికి ప్రయత్నించండి. నిర్దిష్ట సమయానికి మేల్కొనడం, త్వరత్వరగా తమ పనులు చక్కబెట్టుకోవడం మొదలుపెట్టమని చెప్పండి. రాత్రుళ్లు త్వరగా పడుకోబెట్టండి. అప్పుడే ఉదయం వేళ ఏ పేచీ లేకుండా నిద్ర లేస్తారు. అలాగే ఈ సెలవుల్లో పిల్లలకు టీవీ, సెల్‌ఫోను బాగా అలవాటై ఉంటుంది. ఆ అలవాటు మానేలా వారి దృష్టి మరల్చండి.

భయం దూరం చేయండి..

ఇప్పటికే స్కూలుకు వెళుతున్న పిల్లల్లో కూడా తరగతులు మారుతున్నప్పుడు కొత్త తరగతుల భయం వెంటాడుతుంది. భయం పోయేలా కొత్త స్నేహితులొస్తారని, టీచర్లు బోలెడు విషయాలు చెబుతారని చెప్పండి. కొంతమంది పిల్లలు స్కూలు కూడా మారుతూ ఉండవచ్చు. వారికి కూడా కొత్త బెరుకు లేకుండా కొత్త టీచర్లు, కొత్త స్నేహితుల గురించి ఉత్సాహం నింపే మాటలు చెప్పండి.

రఫ్ పుస్తకాలు తయారు చేయండి..

స్కూలు తెరిచిన వెంటనే పాఠాలు మొదలుపెట్టరు. కాబట్టి పాత పుస్తకాల్లోని పేజీలతో ఓ రఫ్ నోట్స్ తయారుచేయండి. స్కూలు బ్యాగుల్లో ఏదైనా రిపేరు ఉంటే మరమ్మతులు చేయడం మర్చిపోకండి. జిప్‌లు వేయించడం, చిరిగిన చోట కుట్టడం లాంటి పనులు చక్కబెట్టుకోండి.

వాతావరణం మార్పులకు సిద్ధం అవ్వండి..

ప్రస్తుతం ఎప్పుడు ఎండ వస్తుందో, వాన పడుతుందో అర్థం కాని పరిస్థితులు ఉన్నాయి. ఒక పక్క ఉక్కపోత, మరోపక్క వానల భయం వెంటాడుతోంది. ఈ భిన్న వాతావరణాలు పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఎండలు ఎక్కువ ఉన్న సమయంలో పిల్లలను స్కూలుకు పంపేటప్పుడు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నీళ్లతో పాటు మజ్జిగను కూడా ఓ సీసాలో పోసి పంపండి. తలకు టోపీ పెట్టుకోమనండి. చెవులు మూసి వుంచేలా రుమాలుతో కట్టండి. వానలు పడేటప్పుడు తడవకుండా జాగ్రత్తలు తీసుకోండి. జలుబు, జ్వరాలు రాకుండా ముందు జాగ్రత్తలు చేసుకోండి.

స్కూలంటే భయం ఉన్న పిల్లలకు ఏదేని అనారోగ్యం చేస్తే ఆ ప్రభావం వారి మీద తీవ్రంగా ఉంటుంది. అందుకే పిల్లలు ఆరోగ్యంగా ఉండేలా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోండి.

స్నేహితుల ఊసులు చెప్పండి..

టీవీలకు, ఫోన్లకు అతుక్కుపోయిన పిల్లలు స్నేహితులతో తొందరగా కలవలేరు. అందుకే స్కూలుకు వెళితే బోలెడంత మంది స్నేహితులు వస్తారని, వారితో సరదాగా గడపవచ్చని, స్నేహంగా ఉండడం వల్ల ఎప్పుడూ సంతోషంగా, ధైర్యంగా ఉండవచ్చని వివరంగా చెప్పండి.


పాత మీద బెంగ పోయేలా..

కొంతమంది పిల్లలు కింది తరగతి టీచర్లతో చాలా అనుబంధాన్ని పెంచుకుంటారు. క్లాసు మారి, కొత్త టీచరు దగ్గరకు వెళ్లడానికి ఇష్టపడరు. అలాంటి పిల్లలకు క్లాసు మారడం వల్ల కొత్త కొత్త విషయాలు నేర్చుకోవచ్చని చెప్పండి. కొత్త టీచరు కూడా బాగా చూసుకుంటారన్న భరోసా మాటలు మాట్లాడండి.

పాతవన్నీ తిరగేయండి..

కింది తరగతుల్లో నేర్చుకున్న విషయాలను ఒక్కసారి పునరావలోకనం చేయించండి. చిన్న పిల్లలైతే తెలుగు, ఇంగ్లీషు అక్షరమాల, చిన్న చిన్న పదాలు, అంకెలు వంటివి. కొంచెం పెద్ద పిల్లలైతే ఎక్కాలు, సైన్సు, సోషల్ పాఠాల్లో నేర్చుకున్న కొత్త విషయాలు వంటివి ఇంకోసారి వల్లె వేయించండి.

రంగు మారకుండా!



వంకాయ, యాపిల్ వంటివి కోసిన కొంతసేపటికే రంగు మారిపోతాయి. అలా కాకుండా ఎక్కువ సేపు తాజాగా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించండి.

- నీటి కొళాయిని తిప్పి వేగంగా వస్తున్న నీటి మధ్యలో యాపిల్‌ను ఉంచి కోసినట్లయితే ఆక్సిడేషన్ ప్రక్రియను ఆపవచ్చు. దీనివల్ల కోసిన తర్వాత యాపిల్ ముక్కలు రంగు మారవు.
- అల్లంలో ఉండే సిట్రిక్ యాసిడ్ ఆక్సిడేషన్ ప్రక్రియను నిలిపివేస్తుంది. కాబట్టి ఏవైనా పండ్లను కోసిన వెంటనే అల్లం ద్రావణంలో వేస్తే రంగు మారకుండా ఉంటాయి.
- వంకాయలను కోసేటప్పుడు ముక్కల్ని ఉప్పు కలిపిన నీటిలో వేస్తే రంగు మారకుండా ఉంటాయి. అలాగే పండ్లు కోసేటప్పుడు కూడా ఉప్పు నీటిలో రెండు నిమిషాలు ఉంచి తీస్తే రంగు మారకుండా ఉంటాయి.
- తేనె నీటి ద్వారా కూడా పండ్ల రంగు మారకుండా అరికట్టవచ్చు. గోరువెచ్చని నీటిలో ఒక టేబుల్ స్పూన్ తేనె వేసి కలపాలి. అందులో పండ్ల ముక్కలు వేసి 30 సెకన్ల తర్వాత తీస్తే పండ్ల ముక్కలు రంగు మారకుండా ఉంటాయి.
- ఒక గాజు గ్లాసులో నీళ్లు తీసుకుని అందులో టేబుల్ స్పూన్ నిమ్మరసం వేసి బాగా కలపాలి. అనంతరం అందులో పండ్ల ముక్కలు వేసి కలిపితే పండ్ల ముక్కలు రంగు మారకుండా ఉంటాయి. నిమ్మరసం అందుబాటులో లేకపోతే పైనాపిల్ రసం, ఆరెంజ్ జ్యూస్ కూడా కలపవచ్చు.

సినీ పరిశ్రమను శాసిస్తున్నదెవరు?



అసలు తెలుగు సినిమా పరిశ్రమలో ఏమి జరుగుతుంది?. ఎందుకు థియేటర్లు మూతపడుతున్నాయి? దానికి కారణం ఎవరు?. మళ్లీ తెరుచుకుంటాయా? లేదా? మొదలైన ప్రశ్నలు సగటు ప్రేక్షకుల నుంచి వస్తున్నాయి. ఓటీటీలు, ఆన్‌లైన్ వేదికగా సినిమాలు అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. కొత్త ట్రెండ్ ఏమిటంటే నేరుగా థియేటర్లలోనే కాకుండా ఓటీటీ వేదికగా కూడా కొన్ని సినిమాలు విడుదలవుతున్న విషయమూ విధితమే. ఈ క్రమంలో మొబైల్‌లోనూ, ఇంట్లోని హోం థియేటర్లలోనే సినిమాలను కుటుంబ సభ్యులంతా కలిసి చూసే పరిస్థితులు కొనసాగుతున్నాయి. అయితే అస్తమానం ఇంట్లోనే ఉంటామా? సరదాగా బయటకు వెళ్దాం అంటూ కుటుంబ సభ్యులు వారాంతపు సెలవుల్లోనూ, తీరిక రోజులు, వేళల్లో సినిమాలకు వెళ్తుండటం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే.

దేశంలోని ఎంతటి మారు మూల ప్రాంతానికైనా ప్రింట్ అవసరం లేకుండా తొలిరోజు, తొలి షోను శాటిలైట్ ద్వారా, కేబుల్ ద్వారా, హార్డ్ డిస్క్ ద్వారా ప్రదర్శించగల సామర్థ్యం డిజిటల్ సినిమాకు ఉండటంతో చాలామందికి ఇది మొగ్గుచూపారు. ఈ విషయంలో మొదట ఎగ్జిబిటర్స్ కొంత అయోమయానికి గురయ్యారు. ఈ డిజిటల్ సిస్టమ్ ఎక్కువ కాలం ఉంటుందా? లేదా లేక పరిస్థితి ఏమిటిదని ఎగ్జిబిటర్స్ ఆలోచిస్తున్న తరుణంలో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ (డిఎస్‌పిలు) రంగ ప్రవేశం చేసి డిజిటలైజేషన్ కోసం మీరేం ఖర్చు పెట్టనక్కరల్లేరు. మీరు పెట్టిన ఖర్చు వచ్చే వరకూ 'వర్చువల్ ప్రింట్ ఫీజు(విపిఎస్) వసూలు చేస్తాం. ఆ తర్వాత చేయబోమంటూ చెప్పి, మాట తప్పి ప్రస్తుతానికి కూడా ఇంకా వసూలు చేస్తూనే ఉన్నారు. అందుకే మనదేశంలో ప్రదర్శించే ఆంగ్ల చిత్రాలకు విపిఎఫ్ ఉండదు.

డిజిటల్ స్క్రీన్స్‌తో మార్పు మొదలు



ప్రదర్శనారంగంలోని ఈ కీలకమైన మార్పుకు అంటే డిజిటల్ సినిమా టెక్నాలజీకి సొసైటీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ అండ్ టెలివిజన్ ఇంజనీర్స్ (అమెరికా 2000, జనవరి 13న) శ్రీకారం చుట్టారు. ఆ ఏడాది డిసెంబర్ కల్లా అమెరికా, కెనడాలో మొత్తంగా డిజిటల్ స్క్రీన్స్ అందుబాటులోకి వచ్చాయి. అయితే డిజిటల్ టెక్నాలజీ(డిటి)కి ఉన్న భవిష్యత్తును ముందే గ్రహించిన అమెరికాలోని డిస్నీఫాక్స్, ఎంజీఎం, పారాషికౌంట్, సోనీ పిక్చర్స్, యూనివర్సల్ వార్నర్ బ్రదర్స్ స్టూడియోలు కలిసి ఓ అంగీకారానికి వచ్చి డిజిటల్ సినిమా ఇన్షియేటివ్ (డిసిఐ) ఫార్మాట్‌కు 2002లో మారారు. ఇది కాస్త ఖరీదైన వ్యవహారం కావటంతో థియేటర్లను 'డిటి' సినిమాకు అనుగుణంగా మార్పుచేస్తున్నపుడు వాళ్ళు చెప్పిన విషయం ఏమిటంటే ఎక్విప్‌మెంట్ కోసం మేం థియేటర్ పర్మిషన్ ఇస్తే చాలు అన్నీ మేమే మార్చేస్తాం అన్నారు. ఇదేదో బాగుందే అనుకోని చాలామంది ఎగ్జిబిటర్లు సరేనన్నారు. పైసా ఖర్చు లేకుండా పని అయిపోదుందన్న ఆనందతో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు తయారుచేసిన అగ్రిమెంట్లు పూర్తిగా చదవకుండా సంతకాలు ఎక్కడ పెట్టమంటే అక్కడ పెట్టేశారు.

చేరువ కాగలిగింది. ఈ సాంకేతిక మార్పుకు అనుగుణంగా అన్ని థియేటర్లు మార్పుచెందాయి.

'గురు'తో మనదేశంలో మొదలు

మనదేశంలో డిజిటల్ ఫార్మాట్‌లో తొలి సినిమాగా మణిరత్నం తీసిన 'గురు' విడుదలైంది. ముంబైలో మొదలైన ఆ సరికొత్త పక్రియ క్రమంగా దేశవ్యాప్తంగా విస్తరించింది. అప్పటివరకూ రీళ్ల యుగంలో ఒక సినిమా ప్రింట్ తీయటానికి రూ.60 వేలు నుంచి రూ.70 వేలు వరకూ అయ్యేది. పెద్ద సినిమాకు కనీసం 400 ప్రింట్లు తీసేవారు ఆఖర్చుతో పోలిస్తే డిజిటల్ సినిమాకు తక్కువ వ్యయమవుతుంతుండటంతో, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు సహజంగానే అటువైపు

అంతా అయోమయం

క్యూబ్, యుఎఫ్ఒ, పిఎక్స్‌డి అంటే ఏమిటన్నది మొదట్లో చాలామందికి తెలియదు. మొదట్లో వారానికి రూ.7500 విపిఎస్ వసూలు చేసేవారు డిఎస్‌పిలు. ఇప్పుడది దాదాపుగా రూ.12 వేల నుంచి రూ.14వేల వరకు చేరుకుంది. డిజిటల్ టెక్నాలజీ వచ్చిన ప్రారంభదశలో కొన్ని థియేటర్లలో ప్రింట్ల ద్వారానే సినిమాను ప్రదర్శించేవారు. అయితే డబ్బు ఆదా అవుతుందనని తెలుగు రాష్ట్రాల్లోని అన్ని థియేటర్లలో ప్రొజెక్టర్లు మాయమై డిజిటల్ టెక్నాలజీ వచ్చేసింది. పైరసీ బూతాన్ని అదుపు చేయొచ్చునని ప్రచారం వల్ల కూడా డిటికి విలువ పెరిగింది. దక్షిణాది రాష్ట్రాలో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లుగా క్యూబ్ సినిమా టెక్నాలజీ ప్రై.బి. (క్యూబ్), యుఎస్ఒ మూవీస్ ఇండియా లిమిటెడ్ (యుఎఫ్ఒ), ప్రసాద్ ఎక్స్‌ట్రీమ్ డిజిటల్ సినిమా నెట్‌వర్క్ (పిఎక్స్‌డి) ఉన్నాయి. డిజిటల్ ప్రొవైడర్స్ వారు సినీ పరిశ్రమ లోని కొంతమంది పెద్దల సహాయంతో థియేటర్స్‌ను మోనోపలీ చేసి చిత్ర పరిశ్రమను శాసిస్తున్నారు.

పెరిగిన దోపిడీ

మొదట్లో క్యూబ్, యుఎఫ్ఒ, పిఎక్స్‌డి సంస్థలు ఉండేవి. ఇప్పుడు కొత్త కొత్త సంస్థలు తక్కువ రేటుకు సర్వీస్ చేస్తామని వస్తున్నా వాటిని కట్టడి చేసే దిశగా వ్యూహాలు రచిస్తూ , అవి అభివృద్ధి చెందకుండా అడ్డుకుంటున్నారు. పెద్ద చిత్రాలకు ఒకరంగానూ, చిన్న చిత్రాలకు మరోరకంగా విపిఎస్ ఛార్జీలు వసూలు చేస్తూ తమను దోచుకుంటున్నారని చిన్న నిర్మాతలు వాపోతున్నారు. మనదేశంలో డిజిటల్ టెక్నాలజీ ప్రారంభమై పదేళ్ళ దాటుతున్నా ఇంకా ఫీజులు వసూలు చేస్తుండటం అన్యాయమేననంటున్నారు. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ చేస్తున్న ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ రంగంలోకి దిగినా, వారితో ఎన్ని మీటింగులు పెట్టి చర్చలు జరిపినా సినీ పెద్దల అండ ఉండటంతో ఉపయోగం లేకుండా పోతోంది. వేరే ప్రొవైడర్స్ ను ఎంకరేజ్ చేయాలంటే ఎగ్జిబిటర్స్‌తో మాకు అగ్రిమెంట్లు ఉన్నాయి. లీగల్‌గా వెళ్లినా మమ్మల్ని ఎవ్వరూ ఏమీ చేయలేరు అంటున్నారు. ఎగ్జిబిటర్స్ చెల్లించాల్సిన విపిఎఫ్ చార్జెస్ మేమెందుకు కట్టాలి అని చాలా సందర్భాల్లో నిర్మాతలు వాదించినా, ఛాంబర్ నిర్ణయాలు తీసుకున్నా కార్యాచరణ జరగడం లేదు.. ఏది ఏమైనా డిజిటల్ ప్రొవైడర్స్ దోపిడీకి అడ్డుకట్ట వేయాలంటే నిర్మాతలందరూ ఒకే మాటపై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది..

ఆరంభం అదిరింది..

- తొలిమ్యాచ్‌లో కెనడాపై అమెరికా ఘనవిజయం
- ఛేదనలో ఆరోన్ జోన్స్ విధ్వంసం
- మెరిసిన ఆండ్రీస్ స్టెఫానస్ గౌస్

ఆరంభం అదిరింది. అమెరికా అదరగొట్టింది. టి20 ప్రపంచకప్ ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య అమెరికా అదిరే విజయం సాధించింది. 195 పరుగుల లక్ష్యాన్ని 17.4 ఓవర్లలోనే ఊదేసింది. ప్రియ ప్రత్యర్థి కెనడాపై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆరోన్ జోన్స్ (94 నాటౌట్) పది సిక్సర్లతో విరుచుకుపడగా.. ఆండ్రీస్ గౌస్ (65) అర్థ సెంచరీతో కదం తొక్కాడు. పొట్టి ప్రపంచకప్‌లో బోణీ కొట్టిన అమెరికా.. ఆ దేశ అభిమానులకు మంచి కిక్కు అందించింది.



ఛేదనలో అసమాన ఇన్నింగ్స్‌తో చెలరేగిన ఆరోన్ జోన్స్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. కెనడాపై విజయంతో గ్రూప్-ఏలో ఆతిథ్య అమెరికా పాయింట్ల ఖాతా తెరిచింది.

డల్లాస్ : పొట్టి కప్పులో తుపాన్ మొదలైంది. ఆరంభ మ్యాచ్‌లోనే అమెరికా సంచలన విజయం సాధించింది. ఆరోన్ జోన్స్ (94 నాటౌట్, 40 బంతుల్లో 4 ఫోర్లు, 10 సిక్స్‌లు) విధ్వంసక ఇన్నింగ్స్‌తో విశ్వరూపం చూపించాడు. ఓ టీ20 ఇన్నింగ్స్‌లో పది సిక్సర్లు బాదిన రికార్డును సమం చేసి కెనడాపై అమెరికాకు 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందించాడు. 195 పరుగుల ఛేదనలో ఓ దశలో ఆశలు కోల్పోయిన అమెరికా.. జోన్స్, ఆండ్రీస్ గౌస్ (65, 46 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) జోడీ 131 పరుగుల ధనాధన్ భాగస్వామ్యంతో అద్భుత విజయం అందుకుంది. అంతకుముందు, నవనీత్ ధాలివాల్ (61, 44 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), నికోలస్ (51, 31 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీలకు తోడు శ్రేయస్ వాసుదేవరెడ్డి మొవ్వ (32 నాటౌట్, 16 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరవటంతో తొలుత బ్యాటింగ్ చేసిన కెనడా 20 ఓవర్లలో 5 వికెట్లకు 194 పరుగులు చేసింది.

ఊహించని విధ్వంసం : అమెరికా లక్ష్యం 195 పరుగులు. 8 ఓవర్ల అనంతరం అమెరికా స్కోరు 48/2. అమెరికా గెలుపు సమీకరణం 72 బంతుల్లో 147 పరుగులు. ఈ దశలో ఎవరూ అమెరికా నుంచి అసమాన పోరాటం ఊహించలేదు. ఆండ్రీస్ గౌస్ (65), ఆరోన్ జోన్స్ (94 నాటౌట్) అక్కడ్నుంచి ఆట గతిని మార్చివేశారు. పవర్‌ప్లే ముగిసిన తర్వాత క్రీజులోకి వచ్చి తొలి నాలుగు బంతుల్లో ఒక్క పరుగూ చేయని జోన్స్.. ఐదో బంతి నుంచి ఊచకోత మొదలెట్టాడు. పది సిక్సర్లు, నాలుగు ఫోర్లతో విశ్వరూపం చూపించాడు. 22 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన జోన్స్‌కు గౌస్ అద్భుత సహకారం అందించాడు. జోన్స్ ప్రేరణతో గౌస్ సైతం ఎదురుదాడి చేశాడు. మూడు సిక్సర్లు, ఏడు ఫోర్లతో చెలరేగాడు. ఈ జోడీ 58 బంతుల్లోనే 131 పరుగులు పిండుకుంది. 14.29 రన్‌రేట్‌తో పరుగుల వరద పారించింది. టీ20 ప్రపంచకప్‌లో ఓ శతక భాగస్వామ్యం రన్‌రేట్ ఇదే అత్యధికం. ఆఖర్లో గౌస్ నిష్క్రమించినా.. కోరే అండర్సన్ (3 నాటౌట్) జతగా జోన్స్ లాంఛనం ముగించాడు. 14 బంతులు మిగిలి ఉండగానే అమెరికా గెలుపు గీత దాటేసింది. ఓపెనర్లు స్టీవెన్ టేలర్ (0) నిరాశపరచగా.. మోనాంక్ పటేల్ 16 పరుగులు చేశాడు. 17.4 ఓవర్లలో 197 పరుగులు చేసింది. కెనడా బౌలర్లలో సనా (1/34), హేలిగర్ (1/19), నిఖిల్ (1/41) తలా ఓ వికెట్ పడగొట్టారు.

విండీస్ బోణి

గయానా: టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ బోణి చేసింది. గ్రూప్ సిలో భాగంగా పాపువా న్యూగినియాతో జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాపువా న్యూగినియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని విండీస్ 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ బ్రెండన్ కింగ్ (34. 29 బంతుల్లో 7 ఫోర్లు), నికోలస్ పూరన్ (27), రాణించారు. జాన్సన్ చార్లెస్ (0) డకౌటవ్వగా.. రొమన్ పావెల్ (15) పరుగులు చేశాడు. చివర్లో కాస్త ఉత్కంఠ ఏర్పడినా రోస్టన్ ఛేజ్ (42, 27 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడి ఒక ఓవర్ మిగిలుండగానే విండీస్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఆండ్రీ రస్సెల్ (15బీ 9 బంతుల్లో 1 సిక్స్) నాటౌట్‌గా నిలిచాడు. న్యూగినియా బౌలర్లలో అసద్ వాలా 2, జాన్ కారికో, చాడ్ సోపర్, అలీ నావో ఒక్కో వికెట్ తీశారు. ఈ మ్యాచ్‌లో ముందుగా టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన పాపువా న్యూగినియా బ్యాటర్లలో సెసే బావు (50, 43 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకం బాదాడు. కెప్టెన్ అసద్ వాలా (21), కిప్లిన్ డోరిగా (27) పరుగులు చేశారు. టోనీ ఉరా (2), లెగా సియాకా (1), హిరీ హిరీ (2) సింగిల్ డిజిట్ స్కోరుకే పెవిలియన్ చేరారు. వెస్టిండీస్ బౌలర్లలో రస్సెల్ 2, అల్జారీ జోసెఫ్ 2, అకీలా హెుసేన్, రొమారియో షెఫర్డ్, గుడాకేష్ మోటీ తలో వికెట్ పడగొట్టారు.

క్వార్టర్స్‌లో స్వైటెక్, గాఫ్

- నాల్గో రౌండ్లో నొవాక్ జకోవిచ్
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ 2024

పారిస్ (ఫ్రాన్స్) : ఫ్రెంచ్ ఓపెన్‌లో టాప్ సీడ్లు జోరుమీదున్నారు. మహిళల సింగిల్స్‌లో ఇగా స్వైటెక్, పురుషుల సింగిల్స్‌లో నొవాక్ జకోవిచ్ అలవోక విజయాలు సాధించారు. టాప్ సీడ్ ఇగా స్వైటెక్, మూడో సీడ్ కొకొ గాఫ్‌లు క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపగా.. పురుషుల సింగిల్స్‌లో నొవాక్ జకోవిచ్, కాస్పర్ రూడ్ ప్రీ క్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. రష్యా అమ్మాయి అనస్థాసియ పొటపోవపై 6-0, 6-0తో స్వైటెక్ ఏకపక్ష విజయం సాధించింది. పాయింట్ల పరంగా 48-10తో స్వైటెక్ తిరుగులేని ఆధిపత్యం చూపించింది. అమెరికా అమ్మాయి, మూడో సీడ్ కొకొ గాఫ్ 6-1, 6-2తో ఎలిసిబెట్టా (ఇటలీ)పై గెలుపొందింది. ఐదు బ్రేక్ పాయింట్లు సాధించిన గాఫ్.. పాయింట్ల పరంగా 54-30తో సత్తా చాటింది. సెర్బియా చిన్నది ఒల్గా డానిలోవిక్ వరుస గేముల్లో పరాజయం పాలైంది. నాల్గో రౌండ్ మ్యాచ్‌లో 4-6, 2-6తో మార్కెట ఒండ్రుసోవకు క్వార్టర్‌ఫైనల్ బెర్త్ చేజార్చుకుంది. కెరీర్ 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో నొవాక్ జకోవిచ్‌కు మూడో రౌండ్లో గట్టి పోటీ ఎదురైంది. ఐదు సెట్లకు దారితీసిన మ్యాచ్‌లో జకోవిచ్ వరుసగా రెండు సెట్లలో ముసెటిని నిలువరించి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. నార్వే ఆటగాడు కాస్పర్ రూడ్ 6-4, -6, 6-2, 6-2తో థామస్ మార్టిన్ (అర్జెంటీనా)పై గెలుపొందాడు. నాలుగు సెట్ల మ్యాచ్‌లో కాస్పర్ రూడ్ ఆరు ఏస్‌లు, ఆరు బ్రేక్ పాయింట్లతో మెప్పించాడు. పురుషుల సింగిల్స్‌లో మెద్వదేవ్, అలెగ్జాండర్ జ్వెరెవ్, ఫ్రిట్జ్ సైతం ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నారు. పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న జోడీ శుభారంభం చేసింది. ఆసీస్ భాగస్వామి మాథ్యూ ఎబ్డెన్ జతగా 7-5, 4-6, 6-4తో బ్రెజిల్ జోడీపై విజయం సాధించాడు.

పారిస్‌కు అమిత్!

- 2024 ఒలింపిక్ బెర్త్ సొంతం

న్యూఢిల్లీ : 2024 పారిస్ ఒలింపిక్స్‌కు మరో భారత బాక్సర్ అర్హత సాధించాడు. వరల్డ్ బాక్సింగ్ క్వాలిఫయర్స్‌లో సత్తా చాటిన అమిత్ పంఘాల్ మెన్స్ 51 కేజీల విభాగం క్వార్టర్‌ఫైనల్లో చైనా బాక్సర్ చుయాంగ్‌ను 5-0తో చిత్తు చేశాడు. తొలి రౌండ్లో 1-4తో వెనుకంజ వేసిన అమిత్.. తర్వాత రౌండ్లలో పుంజుకున్నాడు. వేగంగా పిడి గుద్దుల వర్షం కురిపించిన అమిత్ పంచ్ పవర్‌తో ఏకంగా 5-0తో ఏకపక్ష విజయం సాధించాడు. పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన రెండో భారత పురుష బాక్సర్‌గా అమిత్ నిలిచాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68